నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 5-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 267 పేజీలు: 4 వెల: రూ.1/-

జూలైలో పాఠశాలలు ప్రారంభిస్తాం: హర్యానా

చండీగఢ్,జూన్ 4: హర్యానా ప్రభుత్వం స్కూళ్లు, కాలేజీలను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. దశల వారీగా విద్యాసంస్థలను తెరిచేందుకు తాము ఒక ప్రణాళికను రూపొందించామని ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కన్వర్ పాల్ చెప్పారు. 'ముందుగా 10, 11, 12వ తరగతి విద్యార్థుల కోసం స్కూళ్లు ప్రారంభిస్తాం. ఆ తర్వాత దశలవారీగా 6 నుంచి 9, 1 నుంచి 5 తరగతులను తెరుస్తాం. అయితే 50 శాతం సామర్థ్యంతోనే పాఠశాలలు నడిపేందుకు అనుమతిస్తాం. అంటే ఒక తరగతిలో 30 మంది ఉంటే.. 15 మందికి ఒకపూట, మిగతా 15 మందికి మరోపూట లేదా మరో రోజు తరగతులు నిర్వహించేలా పాఠశాలలను ఆదేశిస్తాం' అని మంత్రి వెల్లడించారు. ఇక డిగ్రీ కాలేజీలను కూడా ఆగస్టు నుంచి ప్రారంభిస్తామని హర్యానా విద్యాశాఖ మంత్రి తెలిపారు. ఆగస్టులో ఫస్టియర్ తరగతులు ప్రారంభమవుతాయని, సెకండియర్ తరగతులను సెప్టెంబర్‌లో ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. విద్యాసంస్థల పునఃప్రారంభానికి అవసరమైన మరిన్ని నిర్ణయాలను యూనివర్సిటీలు తీసుకుంటాయని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా వాయిదాపడ్డ 12వ తరగతి ఫైనల్ పరీక్షలను జూలై 1 నుంచి 15 నిర్వహించనున్నామని, పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేద్దాం

వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకువెళదాం
ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మెరిసన్‌తో ప్రధానమంత్రి మోదీ

న్యూఢిల్లి,జూన్4(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 నేపథ్యంలో తలెత్తిన సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ఆస్ట్రేలియా-భారత్‌ల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిన మంచి సమయం ఇదేనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఇరుదేశాలు వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని ప్రధాని మోడీ అన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మెరిసన్‌తో ప్రధానమంత్రి మోదీ గురువారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. ద్వైపాక్షిక, వ్యూహాత్మక సంబంధాలపై ఇరు దేశాల ప్రధానులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తొలిసారి ద్వైపాక్షిక చర్చలు జరుపుతున్నారు. రవాణా కోసం సైనిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు ఒప్పందం చేసుకునే అవకాశాన్ని పరిశీలించారు. వాణిజ్య, రక్షణ రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించడంపైన చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ... ఆస్ట్రేలియాతో భారత్‌కు స్నేహపూర్వక సంబంధాలున్నాయన్నారు. ఈ ద్వైపాక్షిక సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా మలుచుకుందామని పిలుపునిచ్చారు. కరోనా మహమ్మారి సంక్షోభం నుంచి ఆర్థికవ్యవస్థ త్వరగా బయటపడాలని ఆకాక్షించారు. ఈసంక్షోభ సమయాన్ని అవకాశంగా మలుచుకుందామన్నారు. భారత్, ఆస్ట్రేలియా పరస్పరం సహకారంతో ఎదుగుతాయన్నారు. మహమ్మారి వల్ల తలెత్తిన ఆర్థిక, సామాజిక దుష్ప్రభావాలను అధిగమించడానికి ప్రధాని సమన్వయ సహకార విధానానికి పిలుపునిచ్చారు. ఆస్ట్రేలియాతో సంబంధాలను బలోపేతం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉందన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు బలపడేందుకు, మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఇదే మంచి అవకాశమన్నారు. ఇది రెండుదేశాలకు మాత్రమే కాకుండా ఇండో-పసిఫిక్ ప్రాంతం మొత్తానికి అదేవిధంగా ప్రపంచానికి కూడా ముఖ్యమైనదన్నారు. ఈ సంక్షోభ సమయాన్ని భారత్ అవకాశంగా మలుచుకునేందుకు నిశ్చయించుకుందన్నారు. అన్ని రంగాల్లో దశలవారీగా సంస్కరణలకు తెరతీసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి లో ఫలితాలను మనం త్వరలోనే చూడొచ్చని ప్రధాని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రధానిని భారత్ సందర్శనకు రావాల్సిందిగా ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆహ్వానించారు. ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడిన తర్వాత కుటుంబ సమేతంగా భారత్ సందర్శనకు విచ్చే తమ ఆతిథ్యాన్ని స్వీకరించాల్సిందిగా కోరారు. ఇరు దేశాల ప్రధానులు గడిచిన ఏప్రిల్ 6వ తేదీన మొదటిసారిగా టెలిఫోన్‌లో సంభాషించుకున్నారు. నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు.

సమావేశంలో హాస్యోక్తులు

అయితే ఆ సమావేశంలో కొంత ఫన్నీ సంభాషణ చోటుచేసుకున్నది. మోడీ ఆలింగనాలు మిస్ అవుతున్నట్లు స్కాట్ ఓ జోకేశారు. అంతేకాదు, ఒకవేళ మనం కలుసుకుంటే, తాను చేసిన సమోసాలను కూడా షేర్ చేసేవాడినని స్కాట్ అన్నారు. గత వారం చివర్లో.. ప్రధాని మోదీతో వర్చువల్ భేటీకి ముందు స్కాట్ మోరిసన్ తన ఇంట్లో సమోసాలు తయారు చేశారు. వాటికి సంబంధించిన ఫోటోలను కూడా ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. దానికి ప్రధాని మోదీ కూడా రిప్లై ఇచ్చారు. సమోసాలు తెగ రుచికరంగా ఉన్నట్లు మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అయితే తాజా వర్చువల్ భేటీలో మాట్లాడుకున్న సమయంలో.. తన సమోసాల గురించి స్కాట్ మోరిసన్ మరోసారి గుర్తు చేశారు. అంతేకాదు, ఈసారి గుజరాతీ కిచిడీని కూడా తన కిచెన్‌లో తయారు చేయనున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ తెలిపారు. మనం ఇద్దరం పర్సనల్‌గా కలవడానికి ముందు కిచెన్‌లో కిచిడీ తయారు చేస్తా అని స్కాట్ తన మాటలతో మోదీని నవ్వించారు.

ఆ సందర్భంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కిచిడీ అంటే గుజరాతీ ప్రజలు ప్రసన్నులవుతారన్నారు. ఆస్ట్రేలియాలోనూ గుజరాతీలు ఉంటారు, వాళ్లు కూడా మీ మాటలు వింటే సంతోషిస్తారన్నారు. కానీ కిచిడి వంటకం మా దేశంమంతా ఉంటుందని, అదో కామన్ వెరైటీ అని మోదీ అన్నారు. మీ ఉత్సాహభరిత మాటలకు ధన్యవాదాలు అంటూ స్కాట్‌ను మోదీ మెచ్చుకున్నారు.

పవర్‌తో పెట్టుకుంటే పవరే పోతుంది

విద్యుత్ బిల్లుపై కేంద్రానికి టిఆర్ఎస్ హెచ్చరిక

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): కరెంట్‌తో పెట్టుకుంటే పవర్‌లో లేకుండా పోతారని బీజేపీ ప్రభుత్వాన్ని టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న విద్యుత్ బిల్లుపై టీఆర్ఎస్ఎల్పీలో జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర విద్యుత్ సవరణ బిల్లుతో రైతులకు నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రాల హక్కులను మోదీ సర్కార్ కాలరాస్తోందన్నారు. భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. పవర్‌తో పెట్టుకుంటే పవర్ లేకుండా పోతారని హెచ్చరించారు. రైతులకు సబ్సిడీలు ఇవ్వలేమని ప్రధాని మోదీ చెప్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర బీజేపీ నాయకులు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. పసుపు బోర్డు పేరుతో రైతులను ఎంపీ అరవింద్ మోసం చేశారన్నారు. బీజేపీ నేతలకు దమ్ముంటే రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తేవాలని సవాల్ విసిరారు. పవర్‌తో పెట్టుకున్నోళ్లు ఎవరూ పైకి రాలేదన్నారు. విద్యుత్ సవరణ బిల్లుకు తాము పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్రం నిర్లక్ష్య మౌనం వహిస్తుందని ప్రశ్నించారు. విద్యుత్ సవరణ బిల్లుపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలన్నారు. కరెంట్ విషయంలో కేంద్రంపై రైతులు పోరాటం చేసే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. వలస కార్మికుల ఉసురు కేంద్రానికి తగులుతుందని పేర్కొన్నారు.

తెరుచుకున్న సంక్షేమ హాస్టళ్లు

టెన్త్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సన్నద్ధం
ముందు జాగ్రత్తలు తీసుకున్న అధికారులు

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నేపథ్యంలో మూతబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు గురువారం తెరుచుకున్నాయి. వాయిదాపడిన టెన్త్ పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో విద్యార్థుల సౌకర్యార్థం వసతిగృహాలను తెరువాలని అధికారులు నిర్ణయించారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని వారిని సురక్షితంగా పరీక్షలు రాయించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇప్పటికే ఆదేశించారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 8 నుంచి టెన్త్ పరీక్షలు రాయనున్న 18 వేల మందికి పైగా విద్యార్థులు గురువారం నుంచి హాస్టళ్లకు వచ్చేందుకు అనుమతివ్వడంతో వాటిలో కల్పించాల్సిన ప్రత్యేక సౌకర్యాలు, కరోనా వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. వసతి గృహాలను శుభ్రపర్చడంతోపాటు, క్రిమిసంహారక ద్రావణాన్ని పిచికారీ చేసి సిద్ధంగా ఉంచారు. పిల్లలను ఇంటినుంచే పరీక్షా కేంద్రానికి పంపాల నుకుంటే ... హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ముందుగా సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. విద్యార్థులు మాస్కులు ధరించడం, వ్యక్తిగత శుభ్రత, భౌతికదూరం పాటించడంపై ప్రత్యేక దృష్టి సారించాలి. గదికి ఐదుగురినే ఉంచాలని నిర్దేశించారు. విద్యార్థుల్లో రోగ నిరోధకశక్తి పెంచేలా పండ్ల రసాలు, పండ్లు, స్నాక్స్‌ను రోజువారీ ఆహారంతోపాటు అందించనున్నారు. వ్యక్తిగతంగా ప్యాడ్, ఇతర స్టేషనరీ వస్తువులు ఇవ్వాలి.

విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి ప్రత్యేక గదుల్లో భోజనానికి ఏర్పాట్లుచేయాలి. విద్యార్థులను ప్రైవేటువాహనాల్లో పరీక్షాకేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. మంత్రి కొప్పుల ఆదేశాలతో సంక్షేమశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

కరోనా కట్టడికి ప్రభుత్వ చర్యలు భేష్: మేయర్

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. గోల్నాకా డివిజన్ లో అలీ కేఫ్ చౌరస్తా దగ్గర ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కాలేరు పద్మ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ వేణుగోపాల్ తో కలిసి మేయర్ పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ లో పాల్గొన్నారు. మట్టి కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వాసకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నగరంలో ఈ ప్రత్యేక డ్రైవ్ ను చేపట్టామని తెలిపారు. ఎప్పటికప్పుడు కుండీల్లో నిల్వ నీటిని తొలిగించాలని తడి, పొడి చెత్తను వేరు చేస్తూ ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో హేమలత, ఈఈ ఆశాలత, డీపీవో రజిత, ఏఈ సంతోష్, పారిశుద్ధ్య సూపర్ వైజర్లు, కార్మికులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ అంబర్‌పేటలో పట్టణ పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ బొంతు రామ్మోహన్

కేరళలో ఏనుగు మరణంపై సర్వత్రా ఆవేదన

ఇది ముమ్మాటికి మానవ హత్యే అన్న రతన్ టాటా
ఇసుక బొమ్మతో నివాళి అర్పించిన చిత్రకారుడు పట్నాయక్

ముంబయి,జూన్4(ఆర్ఎన్ఎ): పేలుడు పదార్థాలతో ఉన్న పైనాపిల్ తిని ఏనుగు మరణించిన తీరుపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఆకలితోనే కాకుండా గర్భంతో ఉన్న ఏనుగుకు పైనాపిల్ బాంబును ఆహారంగా పెట్టి చంపిన ఘటనపై తీవ్ర స్థాయిలో దిగ్భాం÷-రతి వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై టాటా గ్రూప్ అధినేత రతన్ టాటా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అది ప్రణాళిక ప్రకారం చేసిన హత్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయంగా బలైన ఆ ఏనుగుకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని ట్విటర్ వేదికగా కోరారు. ఎవరికీ హాని తలపెట్టని, గర్భంతో ఉన్న అమాయక ఏనుగుకు పేలుడు పదార్థాలతో నిండిన పైనాపిల్‌ను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే అందించి దాని మరణానికి కారణమయ్యారన్న విషయం తెలుసుకొని తీవ్ర ఆవేదనకు గురయ్యాను. ఆ విషయం నన్ను షాక్‌కు గురిచేసింది. ఇది కూడా ప్రణాళిక ప్రకారం మనుషులను హత్యచేయడం వంటిదే. ఏనుగుకు న్యాయం జరగాలి అని టాటా ట్వీట్ చేశారు. ఈ దారుణ హత్యపై నెట్టింట్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. కాగా, ఈ ఘటనపై వన్యప్రాణి నేర దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తుందని బుధవారం కేరళ ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై కేంద్రం రాష్ట్రప్రభుత్వాన్ని నివేదిక కోరింది. ఇప్పటికే ఈ ఘటనపై ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా స్పందించగా, టీమిండియా క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలకు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత అమానుష ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని, ఒక్కసారిగా భయాందోళనకు గురైనట్లు కోహ్లి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించాడు. ' గర్భంతో ఉన్న ఏనుగును చంపడం ఏదైతో ఉందో అది నన్ను భయాందోళనకు గురి చేసింది. ఈ వార్త విన్నవెంటనే కలవరపాటుకు గురయ్యా. జంతువుల్ని ప్రేమిద్దాం.. అంతేకానీ ఇలాంటి ఘోరాలకు పాల్పడవద్దు. దీనికి ఇకనైనా ముగింపు పలుకుదాం' అని కోహ్లి ఆవేదన వ్యక్తం చేశాడు.

' మనం క్రూరులమా.. ఇప్పటికీ ఏమీ నేర్చుకోకుండా ఆటవిక పరిస్థితుల్లో బ్రతుకుతున్నామా. ఏనుగును పైనాపిల్ బాంబు పెట్టి విన్న వార్తతో షాక్‌కు గురయ్యా. మూర్ఖత్వంతో జంతువులపై ఈ తరహా దారుణాలు సమంజసం కాదు' అని రోహిత్ పేర్కొన్నాడు. త నెల కేరళలో చోటు చేసుకున్న ఉదంతంపై మల్లప్పురం అటవీశాఖ అధికారి మోహన్ కృష్ణన్ ట్విటర్‌లో పోస్ట్ చేయడంతో ఈ హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. మానవత్వానికి మాయని మచ్చగా మిగిలిన ఈ వైనం పై యావత్ ప్రపంచం దిగ్భ్రాంతికి లోనైంది. ఏనుగు బాధాకరమైన మరణం మానవాళి మొత్తాన్ని సిగ్గుపడేలా చేసింది. పలువురు ప్రముఖులు, సెలబ్రిటీలు సోషల్ మీడియాలో దీనిపై తమ వేదనను, భాధను పంచుకుంటున్నారు. మరో ఏనుగు తీవ్ర గాయాలతో మరణించడంతో అది కూడా ఇలానే జరిగిందనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కష్టకాలంలో ఉన్నవారికి సాయం చేస్తున్న వైద్యులను చూసి మానవత్వం ఇంకా బతికే ఉందనిపించింది.

ఏనుగు చావుకు కారణం మనిషే. ఒక మనిషిగా సిగ్గుపడుతూ.. ఒడిశాలోని పూరీబీచ్‌లో తన శాండ్ ఆర్ట్‌తో ఏనుగుకు సంతాపం తెలియజేశాడు ప్రముఖ ఆర్టిస్ట్ సుదర్శన్ పట్నాయక్. 'ఏనుగు చావుతోనే మానవత్వం కూడా చచ్చిపోయింది. దయచేసి మూగజీవాల ప్రాణాలతో చెలగాటమాడొద్దు. వాటిని సురక్షితంగా జీవించడానికి సహకరిద్దాం' అనే క్యాప్షన్‌ను జోడించి తన బిడ్డతో ఉన్న ఏనుగు ఆర్ట్‌ను ట్విటర్‌లో షేర్ చేశాడు పట్నాయక్. దీని ద్వారా ఏనుగుకు సంతాపం తెలుపుతూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

మారిటోరియం సరే..వడ్డీ సంగతి ఏంటి

ఇఎంలపై వడ్డీ వసూళ్లపై సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ,జూన్4(ఆర్ఎన్ఎ): ఆర్బీఐ తీరుపై సుప్రీం కోర్టు ఆగ్రహించింది. కరోనా వైరస్ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని టర్మ్ లోన్ల ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులపై ఆరు నెలల మారటోరియం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మారటోరియం ఎంచుకున్నవారికి ఈ ఆరు నెలల కాలానికి డౌట్‌స్టాండింగ్‌పై వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ వడ్డీని రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల ఆరోగ్యం కన్నా ఆర్థిక పరిస్థితి ముఖ్యం కాదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ మారటోరియం కాలంలో వడ్డీని మాఫీ చేస్తే బ్యాంకులు, అప్పులు ఇచ్చిన సంస్థలు రూ.2 లక్షల కోట్లు నష్టపోతారని ఆర్‌బీఐ సుప్రీం కోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. 'ఈ అంశాన్ని మీడియాకు లీక్ చేసి సంచలనాత్మకం చేయాలని ఆర్‌బీఐ ప్రయత్నిస్తోందని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఐతే ఈ కేసును ఈ నెల 12 కు వాయిదా వేసింది.

అమెరికా అల్లర్లను సమర్థించిన ట్రంప్ కుమార్తె

-నల్లజాతీయులకు సంఘీభావంగా టిఫనీ పోస్ట్

వాషింగ్టన్,జూన్4(ఆర్ఎన్ఎ): అమెరికాలో ఆందోళన చేస్తున్న నల్లజాతీయులు శాంతించకుంటే.. వారిపై సైన్యాన్ని దింపుతానని డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించగా, ట్రంప్ కూతురు టిఫనీ ట్రంప్ మాత్రం నల్లజాతీయులకు తన సంఘీభావాన్ని ప్రకటించింది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లాక్ స్క్వేర్ పోస్టు చేసింది. శ్వేతజాతి పోలీసుల దురహంకారాన్ని తప్పుపడుతూ .. ట్రంప్ కూతురు తన పోస్టుకు ఓ కామెంట్ కూడా పెట్టింది. వంటరిగా మనం కొంతే సాధిస్తాం, కానీ కలిసి నడిస్తే ఎంతో సాధిస్తామన్న ఓ ట్యాగ్‌ను తన పోస్టుకు జత చేసిందామె. బ్లాక్‌అవుట్ ట్యూజ్‌డే, జస్టిస్‌ఫర్‌జార్జ్ ఫ్లాయిడ్ అనే హ్యాష్‌ట్యాగ్‌లను కూడా ఆమె తన పోస్టులో ప్రజెంట్ చేసింది. నల్లజాతీయుడు జార్జ్ ఫ్లాయిడ్ హత్య నేపథ్యంలో అమెరికా అంతటా ఆగ్రహజ్వాలలు పెల్లుబికుతున్నాయి. అన్ని ప్రధాన నగరాల్లోనూ హింసాత్మక ప్రదర్శనలు చోటుచేసుకుంటున్నాయి. రిపబ్లికన్ పార్టీకి చెందిన వారెవ్వరూ ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకించలేదు. ప్రథమ పౌరురాలు మెలానియా, ఆమె కూతురు ఇవాంకా కూడా ఇప్పటి వరకు మిన్నియాపోలీస్ ఘటనపై స్పందించలేదు. కానీ డోనాల్డ్ ట్రంప్ మాజీ భార్య మార్లా మాపిల్స్ కూతురు టిఫనీ ట్రంప్ మాత్రం ఆ ఘాతుక ఘటన పట్ల తన నిరసన వ్యక్తం చేస్తూ ట్వీట్ చేయడం గమనార్హం. ఆందోళనకారులపై తండ్రి డోనాల్డ్ కత్తులు దువ్వుతుంటే.. కూతురు టిఫనీ మాత్రం నల్లజాతీయులకు సంఘీభావం ప్రకటించడం చర్చాంశమైంది.

రైతు వేదికలు..ప్రగతికి రహదారులు

నారాయణపేట, జూన్ 4 : ముఖ్యమంత్రి కేసీఆర్ రైతును రాజును చేయడం లక్ష్యంగా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని. ఆబ్కారి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మద్దూర్ మండలంలోని లింగాల్ చెడ్ క్లస్టర్ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నదాతలను ఆదుకునేందుకే రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశ పెట్టి ప్రోత్సహిస్తున్న ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు.

డిమాండ్ ఉన్న పంటలను వేసి లాభాలను గడించాలన్నారు. ప్రభుత్వం సూచించిన పంటలు వేసి ఆర్థికంగా బలపడాలని సచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రైతు వేదిక కార్యక్రమం ద్వారా క్లస్టర్ లోని రైతులందరికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో లక్షా ఇరవై వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి చెరువును నింపి సాగునీరు అందిస్తామన్నారు.

తెలంగాణ,తమిళనాడుల్లో వెరైటీ కరోనా

గుర్తించిన సీసీఎంబీ శాస్త్రవేత్తలు
క్లేడ్ ఏ3ఐగా నామకరణం

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులల్ బయాలజీ' (సీసీఎంబీ)కి చెందిన శాస్త్రవేత్తలు దేశంలో భిన్నమైన కరోనా వైరస్ రకాన్ని గుర్తించారు. దీనికి 'క్లేడ్ ఏ3ఐ' అని పేరుపెట్టారు. దేశంలో మొత్తం 64 జన్యుక్రమాలను విశ్లేషించగా, 41 శాతం జన్యువుల్లో వీటి ఉనికిని గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడులో ఈ రకం వైరస్ వ్యాప్తిలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ట్విట్టర్‌లో వెల్లడించారు. 'కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్' (సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో సీసీఎంబీ పనిచేస్తుంది. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణ, తమిళనాడు నుంచి సేకరించిన నమూనాల్లో చాలా వరకు క్లేడ్ ఏ3ఐ రకం వైరస్ ఉన్నట్లు చెప్పారు. దేశంలో కరోనా ప్రబలిన తొలినాళ్లలోనే ఈ నమూనాలను సేకరిం చినట్లు తెలిపారు. ఢిల్లీలో సేకరించిన నమూనాల్లో క్లేడ్ ఏ3ఐకి కొన్ని పోలికలు ఉన్నప్పటికీ, గుజరాత్, మహారాష్ట్ర నమూనాల్లో ఎలాంటి పోలికలు లేవని వివరించారు. సింగపూర్, ఫిలిప్పీన్స్‌లలో గుర్తించిన కరోనా వైరస్‌కు క్లేడ్ ఏ3ఐకి దగ్గరి పోలికలు ఉన్నట్లు చెప్పారు.

అమెరికాలో మిన్నంటిన ఆందోళనలు

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఆందోళనకారులు

వాషింగ్టన్,జూన్4(ఆర్ఎన్ఎ): అమెరికాలో ఆందోళనకారులు.. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వాషింగ్టన్ డీసీలోని ఇండియన్ ఎంబసీలో ఉన్న గాంధీ విగ్రహాన్ని నల్లజాతీయులు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. బ్లాక్ లైవ్స్ మ్యాటర్ నిరసనకారులు ఈ విధ్వంసానికి పాల్పడినట్లు ఓ వార్త సంస్థ పేర్కొన్నది.

గాంధీ విగ్రహం ధ్వంసం ఘటనపై వాషింగ్టన్ పార్క్ పోలీసులు విచారణ మొదలుపెట్టారు. మిన్నియాపోలీస్‌లో జార్జ్ ఫ్లాయిడ్ అనే ఓ నల్లజాతీయుడిని పోలీసులు హతమార్చడంతో.. అమెరికా అంతటా ఆందోళనలు మిన్నంటిన విషయం తెలిసిందే. ఆ ప్రదర్శనలు కొన్ని చోట్ల హింసాత్మకంగా మారాయి. అయితే వాషింగ్టన్‌లోని భారతీయ దౌత్యకార్యాలయంలో.. గాంధీ విగ్రహం ధ్వంసం కావడం కూడా ఆందోళనకారులు పనే అని తేలింది. ఆందోళనకారులు హింసాత్మక బాట పట్టడంతో.. వారిని ట్రంప్ తీవ్రంగానే హెచ్చరించారు. ప్రదర్శనలను శాంతియుతంగా చేయకుంటే.. ఆర్మీని రంగంలోకి దింపనున్నట్లు హెచ్చరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆందోళనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నల్లజాతీయుడిని చంపిన పోలీసు ఆఫీసర్ డెరిక్ చౌవిన్‌తో పాటు ఇతర పోలీసులపైనా కేసులు నమోదు అయ్యాయి. వాషింగ్టన్ డీసీలో గాంధీ విగ్రహం ధ్వంసమైన ఘటన పట్ల అమెరికా క్షమాపణలు చెప్పింది. తమ క్షమాపణలను అంగీకరించాలంటూ అమెరికా అంబాసిడర్ కెన్ జస్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. నల్లజాతీయు జార్జ్ ఫ్లాయిడ్ మృతి పట్ల దిగ్భాం÷-రతి వ్యక్తం చేస్తున్నాని, గాంధీ విగ్రహ ధ్వంసాన్ని కూడా ఖండిస్తున్నట్లు కెన్ జస్టర్ పేర్కొన్నారు. ఎటువంటి వివక్షనైనా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ముగిసిన తిరుమల లడ్డూ విక్రయాలు

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): నగరంలో శ్రీవారి లడ్డూ ప్రసాద విక్రయాలు ముగిశాయి. హిమాయత్ నగర్ టీటీడీ బాలాజీభవన్‌లో నాలుగు రోజుల పాటు లడ్డూలను విక్రయించారు. దాదాపు రెండు లక్షల 75వేల లడ్డూ ప్రసాదాల అమ్మకాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు లడ్డూలను కొనుగోలు చేశారు. ఒక్కో లడ్డూను రూ.25 చొప్పున టీటీడీ అధికారులు విక్రయించారు. నాలుగు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీటీడీ లడ్డూలను విక్రయించింది. లడ్డూల కోసం నగరవాసులు భారీ క్యూలు కట్టారు. మొత్తంగా తిరు

ఈ తాజా పథకం అందుకు తోడ్పడగలదా?

నేటినిజం
శుక్రవారం 5-6-2020

సైన్యంలో చేరాలని ఉత్సాహం చూపే యువతకు పరిమిత కాలంపాటు... అంటే మూడేళ్లపాటు అవకాశమివ్వడం ఈ ప్రతిపాదన సారాంశం. చెప్పాలంటే ఇదొకరకమైన ఇంటర్న్‌షిప్. దీన్ని 'టూర్ ఆఫ్ డ్యూటీ' (టీఓడీ) గా ప్రతి పాదనలో ప్రస్తావించారు. చొరవ, ఉత్సాహం, ఉద్వేగం, దేశం కోసం ఏమైనా చేయాలన్న తపన అధికంగా వుండే యువశక్తిని సక్రమంగా వినియోగించుకోగలిగితే అద్భుతాలు సృష్టించవచ్చని మన నాయకులు తరచూ అంటారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాల యువతతోనే జాతి ఖ్యాతి పెన వేసుకుని వుంటుందని వివేకానందుడు ఎప్పుడో చెప్పారు. ఏ రకమైన సవాలునైనా స్వీకరించాలని, సాహసకృత్యాలు చేయాలని ఉత్సాహపడేవారు అందుకోసం సైన్యంలోకి వెళ్లాలని ఉవ్విళ్లూరుతుంటారు. అలాగని పూర్తికాలం కొనసాగాలంటే అందరూ సిద్ధపడరు. కుటుంబంపై బెంగ, బంధువులు, స్నేహితులు వగైరాలకు సంబంధించిన వేడుకల్లో పాల్గొనే అవకాశం కోల్పోవడం వారికి ఇష్టం వుండదు. కనుక పరిమితకాల వ్యవధిలో పనిచేయడానికి అవకాశమిచ్చే టీఓడీ అందరికీ నచ్చుతుందని, ఎంపిక చేసిన కొన్ని పోస్టులకు దీన్ని వర్తింపజేయొచ్చని ప్రతిపాదన చెబుతోంది. సాధారణంగా జవాన్ల సర్వీసుకాలం 17 ఏళ్లు. అంటే ఎక్కువమంది 37, 38 ఏళ్ల వయసు లోపే రిటైర్ కావాల్సివుంటుంది. అప్పటికల్లా వారికి కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. కళ్లముందు అన్నీ సమస్యలే కనబడతాయి. వచ్చే అరకొర పింఛన్ సరిపోదు. దాంతో వేరే ఉద్యోగం వెదుక్కొవాల్సివస్తుంది. కానీ ఆ వయసువారికి అదంత సులభం కాదు. సైన్యంలోకి వెళ్లకుండా వేరే పనిలో ప్రవేశిస్తే ఈపాటికల్లా స్థిరపడేవాళ్లమన్న అభిప్రాయం వారిలో ఏర్పడుతుంది. జీవితం నిరాశగా అనిపిస్తుంది. కనుకనే ఎలక్ట్రానిక్స్, మెకానికల్ వంటి రంగాల్లో పనిచేసే జవాన్ల రిటైర్మెంట్ వయసు రెండేళ్లు పెంచవచ్చన్న ప్రతిపాదన నిరుడు వచ్చింది.

అధికారుల స్థాయిలో ఈ సర్వీసు 10 నుంచి 14 ఏళ్లు వుంటుంది. ఆ తర్వాత శాశ్వతంగా కొనసాగదల్చుకుంటే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా వున్నారో లేదో చూసి, సంతృప్తి చెందితే పొడిగిస్తారు. అటు జవాన్లకైనా, ఇటు సైనికాధికారులకైనా ఇచ్చే శిక్షణ, అలవెన్సులు, గ్రాట్యుటీ వగైరాలు లెక్కేస్తే వారిపై పెట్టే ఖర్చు చాలా ఎక్కువ. కోట్ల రూపాయల్లో వుండే ఈ మొత్తంతో పోలిస్తే టీఓడీ పథకం కింద మూడేళ్లపాటు సర్వీ సులో కొనసాగేందుకు అనుమతిస్తే ఒక్కొక్కరిపై పెట్టే వ్యయం రూ. 80 నుంచి 85 లక్షల మధ్య అవుతుందని ఈ ప్రతిపాదన చెబుతోంది. సారాంశంలో సైన్యానికి బాగా ఆదా అవుతుంది. టీఓడీ ప్రతిపాదన ఈమధ్య దేశంలో జాతీయవాదం, దేశభక్తి పునరుజ్జీవం పొందాయని చెబు తోంది. ఈ భావోద్వేగాలున్నవారిని ఈ పథకం కింద సైన్యం వైపు మళ్లిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరిస్తోంది. అయితే కేవలం అలాంటి భావోద్వేగాలనే ప్రాతిపదికగా తీసుకోవడం కాక, సైన్యానికి ప్రాథమికంగా కావలసిన ఇతరేతర అర్హతలున్నాయో లేదో కూడా చూసుకోవాలి. ఎందుకంటే ఆ పేరిట సమస్యలు సృష్టించినవారు లేకపోలేదు. సైన్యంలో వరుసగా మూడేళ్లపాటు కొనసాగడం వల్ల అలవడే క్రమశిక్షణ వారు మెరుగైన పౌరులుగా రూపొందడానికి ఉపయోగపడుతుంది. నిండైన ఆత్మవిశ్వాసం, అంకితభావంతో పనిచేసే స్వభావం ఏర్పడతాయి. వీరి విషయంలో కార్పొరేట్ సంస్థలు ఆసక్తిని పెంచుకునే అవకాశం ఉందని ప్రతిపాదన పత్రం చెబుతోంది. మన రక్షణ రంగ వ్యయం అత్యధికం సైనిక దళాలకు కల్పించే సౌకర్యాలు, జీతభత్యాలు వగైరాలకు ఖర్చవుతుంది. అత్యాధునిక ఉపకరణాలు, ఆయుధాలు వగైరా కొనాలంటే 20-25 శాతం మించి వ్యయం చేయడం కుదరడం లేదు. దానికితోడు రాను రాను యుద్ధాల స్వభావం మారుతోంది. వర్తమానంలో భారీ సంఖ్యలో వుండే సిబ్బందికి బదులు, అన్నిటా వినియోగపడే స్మార్ట్ సైనికుల అవసరమే ఎక్కువగా వుంటుంది. సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటూనే కంప్యూటర్లు, ఇతర డిజిటల్ ఉపకరణాలు వినియోగించగలిగే సామర్థ్యం వున్నవారిని రూపొందించుకొనక తప్పదు. కానీ ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఈ తాజా పథకం అందుకు తోడ్పడగలదా అన్నది సందేహమే.

కామారెడ్డిలో మహిళకు కరోనా

గాంధీ ఆస్పత్రికి తరలించిన అధికారులు

కామారెడ్డి,జూన్4(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. ముంబై నుంచి 13 రోజుల క్రితం వచ్చిన ఓ మహిళ రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో తన మేనమామ ఇంటికి చేరుకుంది. సదరు మహిళను ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వైద్యులు వారం రోజుల పాటు హోం క్వారంటైన్ లో ఉంచి పర్యవేక్షించారు. అయితే ఆమెకు కరోనా లక్షణాలు కనిపించడంతో కామారెడ్డి జిల్లా ఏరియా హాస్పిటల్ నుంచి హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. అలాగే జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో 60 ఏళ్ల వృద్ధుడు గత నెల 30వ తేదీన ఏరియా దవాఖానకు వెళ్లగా దగ్గు, దమ్ము, ఆస్తమా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అతడిని గాంధీ దవాఖానకు రెఫర్ చేశారు. అక్కడ పరీక్షలు చేయడంతో పాజిటివ్ గా నిర్ధారణ అయిందని వైద్యులు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు 13 మందిని హోమ్ క్వారంటైన్ లో ఉంచారు.

మోడీకి ట్రంప్ ఫోన్‌తో ఉలిక్కిపడ్డ చైనా

సరిహద్దు సమస్యలు పరిష్కరించుకుంటామని ప్రకటన

జీ-7 సదస్సుకు ఆహ్వానంపై కినుక

బీజింగ్/న్యూఢిల్లీ,జూన్4(ఆర్ఎన్ఎ): భారత్-చైనాల సరిహద్దులో నెలకొన్న ప్రతిష్టంభన విషయంలో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదని చైనా మరోసారి స్పష్టం చేసింది. వీటిని చక్కబెట్టుకునేందుకు కావాల్సిన విధానాలు ఇరుదేశాలకు ఉన్నాయని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఝావో లిజియన్ ప్రకటించారు. భారత్‌లో సరిహద్దు విషయంలో చైనా స్పష్టమైన వైఖరి కలిగి ఉందని.. ప్రస్తుతం అక్కడి పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని పేర్కొన్నారు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొవిడ్-19, భారత సరిహద్దుల్లో పరిస్థితులు, తదితర విషయాలపై ఫోన్‌లో సంభాషించుకున్న నేపథ్యంలో చైనా ఈవిధంగా స్పందించింది. ప్రస్తుతం భారత్-చైనా సరిహద్దుల్లో పరిస్థితులు నియంత్రణలోనే ఉన్నాయి. సరిహద్దుకు సంబంధించి ఇరు దేశాలు కూడా స్పష్టమైన విధానం, సమాచార వ్యవస్థ కూడా కలిగి ఉన్నాయి. సంప్రదింపులు, చర్యల ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునే సామర్థ్యం ఇరుదేశాలకు ఉంది. ఈ సమయంలో థర్డ్ పార్టీ జోక్యం అవసరం లేదు' అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. చైనా, భారత్ మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తానని ఈ మధ్యే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించిన విషయం తెలసిందే. ట్రంప్ ప్రతిపాదనను ఇరుదేశాలు సున్నితంగా తిరస్కరించాయి. అయితే తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ ప్రధాని నరేంద్ర మోదీతో కొవిడ్ తీవ్రత, సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై సంభాషించడం, జీ7 సదస్సుకు భారత్‌ను ఆహ్వానించడం తదితర వరుస ఘటనల నేపథ్యంలో ఉలిక్కిపడ్డ చైనా ప్రతిస్పందించే ప్రయత్నం చేసింది. మరోవైపు భారత్ - చైనా మధ్య నెలకొన్న సరిహద్దు వివాదంపై ఈ నెల 6న ఇరు దేశాల మధ్య చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలకు మిలటరీ స్థాయిలో ఉన్న ఉన్నతాధికారుల మధ్యే చర్చలు జరుగుతాయని అధికారులు వెల్లడించారు. భారత్ చైనా సరిహద్దుల్లోని చుసుల్ - మోల్డో ప్రాంతంలో ఇరు దేశాల మిలటరీ ఉన్నతాధికారులు చర్చించనున్నారు. భారత్ తరపున లెఫ్టినెంట్ జరనల్ హరీందర్ సింగ్ ప్రాతినిధ్యం వహించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాంతీయ స్థాయి కమాండర్లతో ఇరు దేశాల మధ్య చర్చలు జరగడం ఇదే ప్రథమం.

రైతులకు మేలు కోసమే సాగులో మార్పులు

-వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రైతులకు మేలు కలగాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన వ్యవసాయ విధానాన్ని ప్రవేశ పెట్టినట్టు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు.

దశాబ్దాలుగా దగాపడ్డ రైతులు తెలంగాణ రాష్ట్రంలో ధైర్యంగా వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. వారు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి చేరుకోవాలన్నారు. సమగ్ర వ్యవసాయ విధానం పై మంత్రుల నివాస సముదాయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సోనా వల్ల మధుమేహులకు కలిగే ఉపయోగాలపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. వానాకాలంలో వేసే ప్రతి పంటా రికార్డ్ కావాలని కూడా అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి. దీనికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. నేలల వర్గీకరణ జరగాలన్నారు. ఆయా నేలలలో పండే అనుకూలమైన పంటలను గుర్తించాలన్నారు. పెరిగిన భూగర్భ జలాలకు అనుకూలంగా వేసే పంటల విస్తీర్ణంపై ఖచ్చితమైన అంచనాలు ఉండాలన్నారు. ప్రపజలకు కూరగాయల కొరత లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలని, ఇక్కడ పడుతున్నవి, దిగుమతి అవుతున్న వాటిని వివరాల ప్రకారం అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్‌ను ముఖ్య గణాంకాల అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

4న ఎస్సీ హాస్టళ్ల ఓపెనింగ్

వాటిని శానిటైజ్ చేయాలి

అధికారులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశం

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఆందోళనలతో ఉన్న సమయంలో జరుగుబోతున్న 10వ తరగతి పరీక్షలకు ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిని మానసికంగా పరీక్షలకు సిద్ధం చేయాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులకు సూచించారు. విద్యార్థులు భౌతిక దూరం పాటిస్తూ, ఎప్పుడూ శుభ్రమైన మాస్కులు ధరించి, తరచూ చేతులను కడుక్కునేలా వారికి శానిటైజర్‌లను సరఫరా చేయాలన్నారు. స్వీయ నియంత్రణ పాటిస్తేనే కరోనా బారి నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఇలాంటి అన్ని జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, హాస్టళ్లలో విద్యార్థులకు జూన్ 4న ప్రత్యేకంగా హాస్టల్స్ తెరుస్తారని విద్యార్థులు చేరడానికి వారికి సమాచారం పంపించాలన్నారు. వారు వచ్చే సరికే సంబంధిత వసతి గృహాలను శుభ్రపర్చి, శానిటైజ్ చేయాలన్నారు. తల్లిదండ్రులు ఇంటి నుంచి నేరుగా పరీక్షా కేంద్రానికి పంపించడానికి సిద్ధంగా ఉంటే తదనుగుణంగా తల్లి దండ్రుల నుంచి ఒక లేఖను ఇవ్వాలని సూచించాలన్నారు. హాస్టల్ వెల్ఫేజ్ ఆఫీసర్ అటువంటి విద్యార్థుల జాబితాను సిద్ధం చేసి సంబంధిత విద్యాశాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎఎన్‌డబ్ల్యూఓ తన అధికార పరిధిలోని అన్ని ప్రత్యేక హాస్టళ్లను పరిశీలించి కోవిడ్ నివారణతీసుకోవాలన్నారు.. గదుల్లో భౌతిక దూరాన్నిపాటించాలన్నారు. గది వారీగా విద్యార్థుల కేటాయింపు ఖరారు చేయాలని సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌పాటు, హాస్టళ్ల ఇతర ఉద్యోగులు, సిబ్బంది వంతుల వారీగా విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

కరోనా యుద్ధవీరులను కాపాడుకోవాలి

హైదరాబాద్, జూన్ 4:కరోనా వ్యాధి వ్యాప్తిని అరికట్టే ప్రయత్నంలో వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీసులు ప్రతి ఒక్కరూ తీవ్రంగా కృషి చేస్తున్న దశలో వీరంతా కరోనా బారిన పడడం ఆందోళన కలిగిస్తోంది. వారియర్స్ కరోనా బారిన పడితే ఇక కరోనా వచ్చిన వారికి చికిత్స అందించడం దుర్లభం కానుంది. వీరిని జాగ్రత్తగా చూసుకునేందుకు ఎంత ఖర్చయినా వెచ్చించకుంటే మొత్తం సమాజంలో కరోనా వ్యాప్తి మరింత తీవ్రం కావడమే గాకుండా దేశం అల్లకల్లోలం కాగలదు. వైద్యం చేయడానికి వైద్యులు, సిబ్బంది రాకపోతే సమస్య తీవ్రం కావడం ఖాయం. ఇకపోతే వార్తలను కవరేజ్ క్రమంలో జర్నలిస్టులు సైతం కరోనా బారిన పడుతున్నారు. త్వరగా వార్తను అందించాలన్న ఆదుర్దాలో వారు జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేయడం వల్ల అసలుకే ముప్పురావచ్చు. ఈ దశలో కరోనాపై యుద్ధంలో ముందు వరుసలో ఉన్న వారిని కాపాడుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఇకపోతే ఇంతకాలం లాక్‌డౌన్‌తో రోడ్లపైకి జనం ఇష్టం వచ్చినట్లుగా రాకుండా పోలీసులు చేసిన కృషి వల్లనే కరోనాను కట్టడి చేయగలిగాం. ఇప్పటికీ వారు గతంలో కన్నా మరింత అప్రమత్తంగా తమ విధులను నిర్వహిస్తున్నారు. రోడ్డుమీద పోలీసులు, ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర పారామెడికల్ సిబ్బంది చేస్తున్న కృషిని మనమంతా అభినందించాలి. అయితే ఇప్పుడు ఈ రెండు విభాగాల సిబ్బందిని గుర్తించి ప్రభుత్వాలు వారికి అన్ని రకాలు సౌకర్యాలు కల్పించాలి. పిపిఇ కిట్లు, మాస్కులు, రక్షణ కవచాలు, తగిన వసతులు కల్పించాలి. అలాగే వారికి సేదదీరే సమయం ఇవ్వాలి. వంతులవారీగా డ్యూటీలు వేయాలి. వైద్యులు మరీ అలసిపోకుండా చూసుకోవాలి. వారికి సమయానికి ఆహారం, నిద్ర అందేలా చూడాలి. పోలీస్, వైద్య విభాగాలు అలసిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. అయితే ఇదే దశలో వారు కరోనా బారిన పడుతున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ,ఎపి సహా అనేక రాష్ట్రాల్లో వైద్యులు,పోలీసులు కరోనా బారిన పడ్డారు. కొన్నిచోట్ల మరణించారు. ఈ ఘటనలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. లాక్‌డౌన్ సడలింపులతో ప్రజలు గుంపులుగా తిరగడం వల్ల ఒకరినుంచి మరొకరికి సంక్రమిస్తున్నందున దూరం పాటించాలని కోరుతున్నారు. జనం మార్కెట్లపై ఎగబడేందుకు అదేపనిగా బయటకు రాకుండా చూసు కోవాలి. ఇకపోతే కరోనా అన్నది కనీవినీ ఎరుగని కొత్త వైరస్ కావడంతో దీని వ్యాప్తి జరగకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుగుణంగా మనం నడచుకోవాలి. భూకంపమో సునామియో వరదలో క్షామమో అయితే దాని ప్రభావం కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతుంది. తరవాత కేవలం సహాయక చర్యలతో సరిపోతుంది. కానీ కరోనా మనిషి నుంచి మనిషికి తెలియకుండా వ్యాప్తి చెందే మహమ్మారి కనుక నిర్లక్ష్యం వహిస్తే ఊళ్లకుఊళ్లు శ్మశానాలుగా మారిపోయే ప్రమాదం ఉంది. గతంలో వచ్చిన గత్తర, మశూచి లాంటి ప్రమాదాల కంటె ఇది భిన్నమైనదే గాకుండా ప్రమాదకరమైనది కావడంతోనే ఇంతగా అప్రమత్తంగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఇది లోకాన్ని మొత్తంగా తుడిచిపెట్టేసే మహమ్మారి. అభివృద్ధి చెందిన దేశాలనే అల్లల్లాడిస్తోంది. మొదట వ్యక్తమైన ఈ వ్యాధికారక వైరస్ ఇప్పుడు విదేశాల నుంచి వచ్చినవారి కుటుంబీకులకు, సన్నిహితులకు కూడా సోకడం మొదలైంది. సమూహంలో విస్తృతంగా వ్యాపించే దశను మూడో దశ అనీ, ఆ దశలోకి భారతదేశం ప్రవేశించకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రప్రయత్నాలు చేస్తున్నాయి. ఆ దశలోకి ప్రవేశించడం అంటూ జరిగితే, దానంత దుస్థితి భారతదేశానికి మరొకటి ఉండదన్న హెచ్చరికలు ఉన్నాయి. రెండోదశలో ఉన్న దశలో ఇప్పుడు దానిని అదుపు చేసేందుకు తీవ్రంగా కృషి జరుగుతోంది. దేశమంతా వ్యాపించిన ఈ దశలో నివారణకు మాత్రమే మార్గాలు ఉన్నాయి. అందువల్ల అటు వైద్యులు, ఇటు పోలీసులు కృషిని అభినందిస్తూ వారికి మద్దతుగా మనమంతా జాగ్రత్తలు పాటించాలి. మనుషుల మధ్య వ్యాపిస్తున్న ఈ వ్యాధికి నివారణ ఇంతవరకు లేదు. కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి రాలేదు. ఇప్పుడి ప్పుడే దీనిపై ప్రయోగాలు చేస్తున్నారు. ఉన్న మందులతోనే రక్షించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏ దేశంలో దాని తీవ్రత ఎంత ఉన్నది అనే సమాచారం గత కొద్దిరోజులుగా కుప్పలుతెప్పలుగా వస్తున్నది. చైనాలోని వూహాన్‌లో పుట్టి గత డిసెంబర్ నుంచి గడగడలాడిస్తున్న కరోనా చాపకింద నీరులా ఒక్కో దేశానికీ విస్తరిస్తోంది. ఆయా దేశాలను అతలాకుతలం చేస్తోంది. కరోనా వైరస్‌ను విశ్వవ్యాప్త మహమ్మారిగా పరిగణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇప్పటికే ప్రకటించింది. పకడ్బందీ చర్యలు అవసరని, అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ దేశాలను ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరించింది. చాలా దేశాలు ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టే విషయంలో నిర్లిప్తంగా వుండటాన్ని గుర్తించాక సంస్థ ఈ ప్రకటన చేసింది. దీంతో అన్ని దేశాల మాదిరిగానే మనదేశంలోనూ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీంతో ఇక ఇళ్ల నుంచి ప్రజలకు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అయితే రక్షణ చర్యలు తీసుకుంటే ఫర్వాలేదు. కానీ విచ్చలవిడిగా తిరిగితే ఇక ఆదుకునేందుకు ప్రభుత్వం కూడా ముందుకు రాకపోవచ్చు. వైద్యం చేయడానికి ఆస్పత్రులు, డాక్టర్లు సరిపోకపోవచ్చు. కిట్లు కూడా అందుబాటులో ఉండకపోవచ్చు. ఈ దశలో కరోనాతో పోరాడుతున్న వైద్యులు, సిబ్బంది ,పోలీసులకు మాత్రమే ప్రాధనా÷-యం ఇవ్వాల్సి ఉంటుంది.

దేశంలో పెరుగుతున్న కరోనా బాధితుల సంఖ్య

ఆరువేలు దాటిన మృతిచెందిన వారి సంఖ్య

విస్తరిస్తున్న వ్యాధితో సర్వత్రా ఆందోళన

న్యూఢిల్లీ,జూన్4(ఆర్ఎన్ఎ): దేశంలో రోజురోజుకూ వ్యాధి సంక్రమిస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆర్థిక రాజధాని ముంబైలో అత్యధికంగా కేసులు వెలుగుచూడగా.. తరువాతి స్థానంలో తమిళనాడు ఉంది. ఇక్కడ వ్యాధి లక్షణాలు బయట పడ్డవారు కూడా వివిధ దేశాలనుంచి వచ్చిన వారితోనే అన్నది బయటపడ్డది. ఇప్పుడు సామాన్యుల్లో కూడా కరోనా లక్షణాలు కనిపిస్తున్నాయి. యూరప్ దేశాల నుంచి రాకపోకల కారణంగానే న్యూయార్క్‌లో అధికంగా వైరస్ వ్యాపిస్తోందని గమనించడంతో యూరప్‌నుంచి వచ్చేవారిపై ఆంక్షలు విధించింది. వ్యాధి వ్యాప్తిని నియంత్రించడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, రోగగ్రస్తులుగా అనుమానం వచ్చినవారిని పరీక్షించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో వుంచడం ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయి. సూక్ష్మంలో మోక్షమున్నట్టు కొన్ని చిట్కాలతో అంతా సర్దుకుంటుందన్న భ్రమల్లోకి ఎవరూ జారకుండా చూడాలి. అదే సమయంలో అనవసర భయాందోళనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ దశలో దేశంలో జననంచారం, ప్రజల ఆందోళనలు,ర్యాలీలపైనా కరోనా ప్రభావం పడింది. మొత్తంగా భారత్‌లో కరోనా వైరస్ వల్ల మృతిచెందిన వారి సంఖ్య ఆరు వేలు దాటింది. గత 24 గంటల్లో దేశంలో కొత్తగా 9304 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దీంతో దేశంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య 2,16,919కి చేరుకున్నది. గత 24 గంటల్లో 60 మంది మృతిచెందారు. దేశంలో మొత్తం 106737 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. 104107 మంది వైరస్ బారి నుంచి కోలుకున్నారు. ఇక ఇప్పటి వరకు దేశంలో మరణించిన వారి సంఖ్య 6075కు చేరుకున్నట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది.

ఇప్పటి వరకు అత్యధికంగా మహారాష్ట్రలో 2587 మంది, గుజరాత్‌లో 1122 మంది కరోనా వైరస్ వల్ల మృతిచెందారు. ఇక ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య 64,30705కు చేరుకున్నట్లు జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ పేర్కొన్నది. ఆ వైరస్ వల్ల మృతిచెందిన వారి సంఖ్య 385947గా ఉంది.

కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను చుట్టుముట్టిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 65 లక్షల 67 వేల 404 మంది కరోనా వైరస్ పాజిటివ్ భారిన పడ్డారు. వీటిలో యాక్టివ్ కేసుల సంఖ్య 3 లక్షల 10 వేల 562. వ్యాధి నుంచి 31 లక్షల 68 వేల మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. కోవిడ్-19 కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 3 లక్షల 87 వేల 913 మంది చనిపోయారు. మెక్సికో, బ్రెజిల్‌లో గడిచిన 24 గంటల్లో రికార్డుస్థాయిలో కోవిడ్-19 మరణాలు సంభవించాయి. మెక్సికోలో గడిచిన 24 గంటల్లో వెయ్యి మందికి పైగా మరణించడం ఇదే మొదటిసారి. వ్యాధి కారణంగా మెక్సికోలో నిన్న 1,092 మంది చనిపోయారు. అంతకుక్రితం రోజు మరణాల సంఖ్య 470గా ఉంది. బ్రెజిల్‌లో సైతం గడిచిన 24 గంటల్లో రికార్డుస్థాయిలో ఒక్కరోజే 1,349 మంది చనిపోయారు. కోవిడ్-19 కారణంగా ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మరణాలు సంభవించిన దేశాల వివరాలిలా ఉన్నాయి. అమెరికాలో ఇప్పటివరకు 1 లక్ష 9 వేల 142 మంది చనిపోగా బ్రెజిల్-32,568, రష్యా-5,215, స్పెయిన్-27,128, యూకే-39,728, ఇటలీ-33,601, జర్మనీ-8,699, పెరూ-4,894, టర్కీ-4,609, ఇరాన్-8,012, ఫ్రాన్స్-29,021, చిలీ-1,275, మెక్సికో-11,729, కెనడా-7,498, చైనా-4,634, పాకిస్థాన్-1,688, బెల్జియం-9,522, నెదర్లాండ్స్-5,977, ఈక్వెడార్-3,486, స్వీడన్-4,542, కొలంబియా-1,045, పోర్చుగల్-1,447, స్విట్జర్లాండ్-1,921, ఈజిప్టు-1,088, ఇండోనేషియా-1,698, ఐర్లాండ్-1,659, పోలాండ్-1,115, రొమేనియాలో 1,296 మంది కోవిడ్-19 కారణంగా చనిపోయారు.

శుభకార్యాలపై తొలగని సందిగ్ధత

ఆంక్షల కారణంగా రద్దు చేసుకున్న పెళ్లిళ్ళు అనేకం

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): పెళ్లంటే.. నూరేళ్ల పంట. మూడుముళ్ల బంధంతో.. కొత్త జీవితంలోకి అడుగుపెట్టాలని ఎన్నో జంటలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ప్రధానంగా పెళ్లిళ్లను పెట్టుకున్న వారు హైరానా పడుతున్నారు. ఇప్పటికిప్పుడు వివాహాలు జరుగుతాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. పరిమిత సంఖ్యలోనే పెళ్లిళ్లకు అనుమతులు ఇస్తున్న వెళ్లడానికి బంధువులు ఆసక్తి చూపడం లేదు. అందుకే వేలాది పెళ్లిళ్లు రద్దు చేసుకున్నారు. ఎప్రిల్,మేలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెట్టుకున్నా వారు ముహూర్తాలను రద్దు చేసుకున్నారు. ఇక విదేశాల నుంచి వచ్చే వారికి అవకాశం లేకుండా పోయింది. ఇందులో పెళ్లి కూతుళ్ల, పెళ్లి కుమారులు కూడా ఉన్నారు. ఇలాంటి వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. ఏం చేయాలో దిక్కు తోచక తలలు పట్టుకుంటున్నారు. పెళ్లంటే నూరేళ్ల పంట..దీనికి ఓ మంచి ముహూర్తం కూడా అవసరం. జాతకాల మేరకు పెళ్లి ముహూర్తాలు నిర్ణయిస్తారు. అప్పటికే పెళ్లి కార్డులు పంచిన వారు తమ పెళ్లిళ్లు వాయిదా వేయడానికి వెనకాడుతున్నారు. కరోనా కారణంగా పెళ్ళిళ్లు వాయిదా వేసుకోవాలన్న ప్రభుత్వ తాజా ఆదేశాలతో సర్వత్రా ఇప్పుడు ఆందోళన నెలకొంది. ఈ దశలో యంగ్ హీరో నిఖిల్ తన పెళ్లి యధావిధిగా జరుగుతుందని అన్నారు. వాయిదా వేసుకునేది లేదన్నారు. కొద్దిరోజుల క్రితం డాక్టర్ పల్లవితో నిశ్చితార్థం జరుపుకున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 16న వాళ్ల పెళ్లి ముహూర్తంగా నిర్ణయించారు. అయితే ప్రస్తుతం కరోనా వైరస్ ముప్పుని తీవ్రంగా ప్రకటించిన ప్రభుత్వం ఫంక్షన్ హాల్స్ బుకింగ్స్‌పై కఠినంగా ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో నిఖిల్ పెళ్ళి సింపుల్‌గా ముగించాడు. జీవితంలో పెళ్లి అనేది ఎవరికైనా ఓ గొప్ప ఫీలింగ్. కానీ ప్రజల బాగోగులు కూడా చాలా ముఖ్యమనేది మరిచిపోకూడదు. ప్రజలు, ఫ్యామిలీ, ఫ్రెండ్స్, నన్నిహితుల సేఫ్టీని దృష్టిలోపెట్టుకొని తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నారు. రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. ముమ్ముందు పరిస్థితులు మెరుగుపడుతాయనే ఆశాభావంతో ఉన్నారు. మరోవైపు ఏప్రిల్ 16న నటుడు నితిన్ పెళ్లి దుబాయ్‌లో జరగాల్సి ఉండగా, దీనిపైనా సందిగ్ధం నెలకొంది. వాస్తవ

ఇసుక రీచ్‌లతో లాభాల పంట

అక్రమాలకు తెరతీస్తున్న నేతలు

వైకాపా నేతల హస్తం ఉందంటున్న టిడిపి

విజయవాడ,జూన్4(ఆర్ఎన్ఎ): కరోనాతో ఇంతకాలం ఇసుక వ్యవహారం పక్కకు పోయింది. లాక్‌డౌన్ సడలింపతులో కార్యకలాపాలు మొదలు కావడంతో ఇప్పుడు మళ్లీ ఇసుక వ్యవహారం కలకలం రేపుతోంది. ఇసుక అక్రమాలపై మళ్లీ టిడిపి గళమెత్తుతోంది. అక్రమాలకు వైకాపా నేతలే కారణమని చెబుతున్నారు.

గతంలో ఇసుక రీచ్ నుంచి లారీలలో నేరుగా లోడింగ్ అయి బుకింగ్ చేసుకొన్న వారి ఇళ్లకు చేరేది. నేడు రీచ్ నుంచి స్టాక్‌యార్డు, స్టాక్‌డిపోకు చేరుస్తోండటం, అక్కడినుంచి వినియోగదారుడికి వెళ్లాల్సి ఉండటంతో మార్గమధ్యలో దారి మళుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడి జరిగిందని అదేపనిగా ఆరోపణలు చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు ఇప్పుడు వారి పరిపాలనలోనూ అక్రమాలు జరుగుతున్నాయని చెప్పడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. అకౌంటబిలిటీ, ట్రాకింగ్ విధానంలో లోపాల వలన ఇసుకని ఇసుకాసురులు దారి మళ్లించి సొమ్ము చేసుకొంటున్నారు. గత ఏడాది ఇసుక నూతన విధానం తీసుకురావడంలో జాప్యం జరిగింది. గతంలో మైనింగ్, ఏపీఎండీసీ, మైనింగ్ విజిలెన్స్, పోలీసు, రెవెన్యూ విభాగాలు ఇసుక రవాణాని పర్యవేక్షించినా అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రభుత్వం తీసుకొచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోనైనా దీనికి ఫుల్‌స్టాప్ పెడుతుందో లేదోనన్న చర్చ జరుగుతోంది.ఇసుక రీచ్‌లకు అనుమతి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో కొన్ని రీచ్‌లలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. పట్టాభూముల్లో ఇసుకమేటల తొలగింపునకు అనుమతులు మంజూరు చేయగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మిగతా ఐదింటిలో సాధ్యమైనంత త్వరగా తవ్వకాలు ప్రారంభించకపోతే నిలిపేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తీరా పాలసీ వచ్చేసరికి కృష్ణానదికి మూడునెలల పాటు వరద కొనసాగడంతో ఇసుకని తోడలేకపోయారు. దాంతో భవన నిర్మాణం రంగం పూర్తిగా స్తంభించిపోయి లక్షలమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దానిని దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది ముందుగానే స్టాక్‌యార్డులు, డిపోలలో ఇసుక నిల్వ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఇందులోనూ ఇసుక పక్కదారి పట్టింది. లాక్‌డౌన్ సమయంలో రీచ్ నుంచి తవ్విన ఇసుకని దారి మళ్లించడంతో పోలీసులు దాడులు చేసి పట్టుకొని వాహనాలను సీజ్ చేశారు. వర్షాలు కురవడం ప్రారంభం అయ్యే లోపు మిగతా ఇసుకని డిపోలకు చేర్చాల్సి ఉంది. ప్రభుత్వం మరోసారి ఇసుక విధానాన్ని సవరించి నూతనంగా తీసుకురావాలని నిర్ణయించింది. దీని దృష్ట్యా ఇసుక పక్కదారి పట్టకుండా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రంగంలోకి దిగింది. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఇసుక దారి మళ్లింపులో భాగస్వామ్యమై ఉన్నట్లు ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఈబీ నిస్పక్షపాతంగా ఇసుక అక్రమ రవాణాన్ని అరికట్టకపోతే ఆ సంస్థ ఏర్పాటు చేసి నిష్ప్రయోజనం అవుతుంది. గత సంవత్సరకాలంగా ఇసుక అక్రమరవాణా జరుగుతోందంటూ టీడీపీ చేస్తున్న ఆరోపణలు అక్షరాల నిజమని టీడీపీనేత యరపతినేని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యేల వ్యాఖ్యలతో ఇది తేలిందన్నారు. రీచ్‌ల నుంచి వచ్చిన లారీలు నియోజకవర్గానికి చేరడం లేదని పొన్నూరు, వినుకొండకు చెందిన వైసీపీ ఎమ్మెల్యేలు మొన్నటి సమావేశంలో గళమెత్తారని గుర్తు చేశారు. ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరులో పెద్దఎత్తున ఇసుక, మట్టి, మైనింగ్ అక్రమాలు జరగుతున్నాయని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు.

రెండోవిడత వాహనమిత్రకు శ్రీకారం

లబ్దిదారులకు రెండో విడతగా రూ.10వేలు ఆర్థిక సాయం

క్యాంపు కార్యాలయంలో ప్రారంభించిన సిఎం జగన్

అమరావతి,జూన్4(ఆర్ఎన్ఎ): రెండో విడత వైఎస్సార్ వాహన మిత్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా రూ.262.49 కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఆటో, ట్యాక్సీ ఉన్న 2,62,493 మంది లబ్దిదారులకు రెండో విడతగా రూ.10వేలు ఆర్థిక సాయం అందనుంది. ఆటో, ట్యాక్సీ కార్మికులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడారు.గత ఏడాది కంటే అదనంగా 37,756 మంది లబ్దిదారులను రవాణా శాఖ ఎంపిక చేసింది. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం వైఎస్సార్ వాహన మిత్ర లబ్దిదారులకు అక్టోబర్‌లో రూ.పది వేలు ఇవ్వాల్సి ఉంది. అయితే కరోనా కష్టాల నేపథ్యంలో నాలుగు నెలల ముందుగానే సాయం విడుదల చేయనున్నారు. ఈ పథకానికి ఎనిమిది కార్పొరేషన్ల ద్వారా రెండో ఏడాది ఆర్థిక సాయాన్ని విడుదల చేశారు. కొత్తగా ఆటోలు కొన్నవారికీ వాహన మిత్ర పథకాన్ని వర్తింపజేశారు. గతేడాది సెప్టెంబరు 23 నుంచి ఈ ఏడాది మే 16 వరకు వాహనాల కొనుగోలు, యాజమాన్య బదిలీ హక్కులు పొందిన వారిని అర్హులుగా ఎంపిక చేశారు. వాహన మిత్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం జిల్లా నుంచి రాష్ట్ర మంత్రులు బాలినేని శ్రీనివాసులు రెడ్డి, ఆదిమూలపు సురేష్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జిల్లా కలెక్టర్ పోలా భాస్కర్ రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. చిత్తూరు నుంచి ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి, ఎంపీ రెడప్ప, కలెక్టర్ భరత్ గుప్త , ఏపీఐఐసీ చైర్మన్ ఆర్ కె రోజా, ఎమ్మెల్యేలు శ్రీనివాసులు,నవాజ్ బాషా,ఎం ఎస్ బాబు పాల్గొన్నారు.

ట్రంప్ లాగే జగన్‌కూ బంకర్ పరిస్థితి తప్పదు

వైకాపా విధానాలపై మండిపడ్డ టిడిపి నేత యరపతినేని

అమరావతి,జూన్4(ఆర్ఎన్ఎ): ప్రజావ్యతిరేక విధానాలతో జగన్ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారని టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాస్ విమర్శించారు. నేరచరిత్ర స్వభావం ఉన్న వ్యక్తి పరిపాలిస్తే రాష్ట్రం ఎలా ఉంటుందో జగన్ ఏడాది పాలనే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ప్రజలు తిరగబడితే ట్రంప్ వెళ్లి బంకర్లో దాక్కున్నారని... జగన్ కూడా బంకర్లు కట్టించుకోవాల్సిన పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో వస్తుందని అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను న్యాయస్థానాలు తప్పుబడుతుంటే చులకనవుతున్న తీరును పక్కదోవ పట్టించేందుకే వైకాపా నేతలు తెలుగుదేశాన్ని నిందిస్తున్నారని మండిపడ్డారు. ప్రతీదానికీ చంద్రబాబు వయస్సు మీద విమర్శలు చేస్తున్నారని..వారికి వయస్సు పెరగదని వైకాపా నేతలు భావిస్తున్నారా అని ప్రశ్నించారు. చంద్రబాబు వయస్సు గురించి మాట్లాడే అంబటి రాంబాబు ఆయనతో కలిసి తిరుమల కొండ ఎక్కగలరా అని సవాల్ విసిరారు. తెలుగుదేశం పార్టీకి భవిష్యత్తు నాయకులెందరో ఉన్నారని...వైకాపా నేతలు విమర్శిస్తున్నట్లుగా లోకేష్‌కి అవినీతిలో అనుభవం లేదని అన్నారు. వాళ్ల మాదిరి సూట్ కేసు కంపెనీలు పెట్టడం, దొంగ సొమ్ము దోచుకోవటం, అక్రమార్జన చేయటంలో జగన్‌లా లోకేష్‌కి అనుభవం లేదని విమర్శించారు. శశికలలా జైలుకెళ్తే వైకాపా కుక్కలు చింపిన విస్తరే అని దుయ్యబట్టారు. జగన్ చుట్టూ ఉన్నవారంతా అవకాశవాదులు కాదా అని ప్రశ్నించారు. ధర్మాన, బొత్స, వీళ్లంతా జగన్‌ని విమర్శించిన వారే వై.ఎస్ మరణం వెనుక కూడా జగన్ హస్తం ఉందని బొత్స విమర్శలు చేయలేదా అని నిలదీశారు. చంద్రబాబు, లోకేష్‌ల మీద నోరు పారేస్తే ఉతికి ఆరేస్తాం ఖబద్దార్ అని యరపతినేని హెచ్చరించారు.

హరితహారం కార్యక్రమం మనందరిదీ

మనమంతా అందులో భాగస్వాములం కావాలి: వినోద్

రాజన్న సిరిసిల్ల,జూన్3(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, తెలంగాణను అగ్రగామిగా నిలుపాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. హరితహారంతోనే వాతావరణంలో మార్పులు సాధ్యమని అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. హరితహారంలో భారీ ఎత్తున మొక్కలను నాటేందుకు కోదండరాం, పొట్టిగుట్ట, పెద్ద గుట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి, వ్యవసాయ రంగంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణను, హరితహారంలోనూ అగ్రభాగాన నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఒకప్పుడు సిరిసిల్ల జిల్లాలోని వీర్ పల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లో అడవులు పెద్ద ఎత్తున ఉండేవన్నారు. కాలక్రమంలో అడవులు అంతరించి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి అడవులకు పునర్జీవం పోయడానికి సీఎం కేసీఆర్ హరిత యజ్ఞాన్ని చేపట్టారన్నారు. మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని ప్రతి పల్లే పచ్చదనం సంతరించుకునేలా మొక్కలు నాటాలని కోరారు. ఈ వర్షాకాలంలో భారీ సంఖ్యలో మొక్కలు నాటేందుకు నాగారం గుట్టలను పరిశీలించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ మంజీర యాత్రకు ప్రభుత్వం బ్రేక్

మరోమారు నేతలను గృహనిర్బంధం చేసిన పోలీసులు

అక్రమాలతో గట్టెక్కే ప్రాజెక్టులకే సిఎం కెసిఆర్ మొగ్గు

ఆయనకు అనుభవంతో పాటు ముందుచూపు లేదు

కేసీఆర్ మెదక్ ప్రజలకు అన్యాయం చేస్తున్నారు

హౌజ్ అరెస్ట్‌లతో పోలీస్ రాజ్యం నడుస్తోందన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్‌కు అనుభవంతో పాటు ముందుచూపు కూడా లేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌లో మే 2018 నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి పని కూడా ఎందుకు చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ, నీతారామా ప్రాజెక్టులలో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన అన్నారు. ఆ ప్రాజెక్టులపై చూపించే ప్రేమ మరి ఎస్ఎల్‌బీసీ మీద ఎందుకు చూపించరని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన ఆరేళ్ల తర్వాత కూడా ఎస్ఎల్‌బీసీ ఎందుకు పూర్తి కాలేదని ఆయన ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి నివాసం వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రాజెక్టుల పరిశీలన పేరుతో జలదీక్షలకు కాంగ్రెస్ పార్టీ పూనుకున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలోని మంజీరా డ్యామ్ పరిశీలనకు వెళ్లేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా పలువురు నేతలు సిద్ధమయ్యారు. దీంతో ఉత్తమ్ ఇంటి వద్దకు పోలీసులు చేరుకుని వారు వెళ్లకుండా అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఆరు సంవత్సరాల కాలంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కృష్ణా పరవాహక ప్రాంత ప్రాజెక్టులను సందర్శించేందుకు వెళ్లిన నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో గురువారం సంగారెడ్డి జిల్లాలోని మంజీరా డ్యామ్ పరిశీలనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి వెళ్లనుండా పోలీసులు అడ్డుకున్నారు. హౌస్ అరెస్టు కావడంతో ఉత్తమ్ తన ఇంట్లో మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టులన్నీ కమీషన్ల కోసమే నిర్మిస్తున్నారని ఆయన అన్నారు. గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని ఎందుకు వాడుకోవడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజావసరాలు తీరే వరకు పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. సీఎం కేసీఆర్.. మెదక్ ప్రజలను వోసం చేస్తున్నారని ఆయన అన్నారు. సింగూరు ప్రాజెక్ట్, మంజీర డ్యాంల నుంచి ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. నీళ్లు తరలించడం వల్లే సంగారెడ్డి జిల్లా ప్రజలకు తాగునీటి కష్టాలు వచ్చాయని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆహ్వానం మేరకు పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు, ప్రజా ప్రతినిధులు గురువారం సంగారెడ్డి జిల్లాలోని మంజీరా డ్యామ్ పరిశీలనకు వెళ్లాలని అనుకున్నారు. అయితే వారిని పోలీసులు బయటకు రాకుండా.. ఆయన ఇంటి వద్ద భారీగా మోహరించారు. పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా మారోద్దని ఆయన అన్నారు. 'కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ పదివేల మందితో ప్రారంభించారు. మంత్రులు జిల్లాల్లో నూతన వ్యవసాయ సాగు విధానం గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మరి వారికి లేని రూల్స్.. మాకే వర్తిస్తాయా' అని ఆయన ప్రశ్నించారు. పోలీసులు కల్వకుంట్ల సైన్యం కావొద్దని ఆయన అన్నారు. ప్రజలకు ఒక చట్టం.. కల్వకుంట్ల వారికి ఒక చట్టం ఉంటుందా అని ఆయన పోలీసులను ప్రశ్నించారు.

ప్రపంచ యుద్ధ సమయంలోనూ ఇలా జరగలేదు

లాక్‌డౌన్‌తో పేదలు,వలస కార్మికులు తీవ్రంగా నష్టపోయారు

రాజీవ్ బజాజ్‌తో రాహుల్ కరోనా చర్చ

లాక్‌డౌన్ కారణంగా నష్టపోయామన్న బజాజ్

న్యూఢిల్లీ,జూన్4(ఆర్ఎన్ఎ): ప్రపంచ యుద్ధం జరిగే రోజుల్లో కూడా ప్రజలంతా ఇలా లాక్‌డౌన్‌లో లేరని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీంతో పేదలు, వలస కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కొవిడ్-19 కారణంగా ఆర్థికవ్యవస్థ పతనంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త, బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్‌తో జరిపిన చర్చలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కరోనా వైరస్ మహమ్మారి నుంచి తప్పించుకోడానికి కొద్ది నెలలుగా ప్రపంచమంతా లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. 'ఇదంతా వింతగా ఉంది. ప్రపంచం మొత్తం ఈ విధంగా లాక్‌డౌన్‌లోకి వెళ్తుందని ఎవరూ ఊహించలేదు. ప్రపంచ యుద్ధం సమయంలో కూడా ఈ విధంగా ఉండేది కాదేమో. ఇదొక ప్రత్యేకమైన, వినాశకరమైన పరిస్థితి' అని రాహుల్ విచారం వ్యక్తం చేశారు. రాహుల్‌తో జరిగిన చర్చలో భాగంగా బజాజ్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. కరోనా వైరస్ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యే క్రమంలో భారత్ పశ్చిమ దేశాలవైపు చూసి పొరపాటు చేసిందని రాజీవ్ అన్నారు. తూర్పు దేశాలు కరోనా వైరస్‌ను సమర్థవంతంగా కట్టడి చేశాయని.. ఆయా దేశాల స్పందనను భారత్ గమనించాల న్నారు. 'మనం యూఎస్, ఫ్రాన్స్, ఇటలీ, యూకే వంటి దేశాల సంసిద్ధతను పరిశీలించాం. అక్కడి వ్యవస్థ మన దేశానికి ఏవిధంగానూ సరిపోలదు. కొవిడ్-19 వంటి పరిస్థితిని ఎదుర్కోడానికి మన దగ్గర ఉన్న వైద్యరంగ సదుపాయాలు సరిపోవన్న విషయం మనం గ్రహించాలి. యూఎన్, ఐరోపా దేశాలు వైరస్‌తో ప్రభావితమైతే ప్రతిఒక్కరు భయపడతారన్న ఉద్దేశం ఉందనుకుంటున్నాను. ధనవంతులు, సెలబ్రిటీలు వైరస్ బారిన పడితే పెద్ద విషయం అవుతుంది. కానీ, ఆఫ్రికాలో నిత్యం 8000 మంది పిల్లలు ఆకలితో మరణిస్తున్నారు. దాన్ని ఎవరు పట్టించుకుంటున్నారని రాజీవ్ అన్నారు. కరోనా వైరస్ దేశాన్ని పట్టిపీడిస్తోన్న నేపథ్యంలో దేశ స్థితిగతులపై రాహుల్ గాంధీ పలువురు ఆర్థికవేత్తల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. వారిలో రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్, నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీతో పాటు ప్రముఖ వైద్య నిపుణులు ప్రొఫెసర్ ఆశిశ్ ఝా ఉన్నారు. బాజాజ్ ఆటో ఎండీ రాహుల్ బజాత్‌తో రాహుల్ గాంధీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భారతీయ ఆర్థిక వ్యవస్థపై లాక్‌డౌన్ ప్రభావం అన్న అంశంపై ఇద్దరూ చర్చించారు. వైరస్ సంక్రమించడం అంటే చావడమే అన్న భయాన్ని ప్రజల్లో నింపినట్లు బజాజ్ అన్నారు. దీని నుంచి బయటపడడం కష్టమే అన్నారు. ప్రజల నుంచి ఆ భయాన్ని తొలగించాంటే ప్రధాని మోదీ ఏదైనా చెప్పాలన్నారు. కఠినమైన లాక్‌డౌన్ అమలు చేసినా.. దాంట్లో కొన్ని లోపాలు ఉన్నట్లు బజాజ్ తెలిపారు. ఆ లోపాల వల్ల వైరస్ ఇంకా సజీవంగా ఉందన్న విషయాన్ని ఆయన తెలియజేశారు. ఆ సమస్యను పరిష్కరించకుండానే, ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినట్లు బజాజ్ అన్నారు. లాక్‌డౌన్‌తో జీడీపీ పడిపోయిందన్నారు.

నేరాల ఛేదనకు ఆధునిక టెక్నాలజీని అస్త్రంగా వినియోగించాలి

-కరీంనగర్ పోలీస్ అడిషనల్ కమిషనర్ జి చంద్రమోహన్

కరంనగర్, జూన్ 4 (నేటినిజం ప్రతినిధి):వివిధ రకాల నేరాల ఛేదనకోసం పోలీసులు టెక్నాలజీ వినియోగం అస్త్రంగా వినియోగించుకోవాలని కరీంనగర్ పోలీస్ అడిషనల్ కమిషనర్ జి చంద్రమోహన్(పరిపాలన) అన్నారు. క్రైంపార్టీ పోలీసులు నేరాలను ఛేదించడాన్ని ఛాలెంజ్‌గా తీసుకోవాలని తీసుకోవాలని పిలుపునిచ్చారు.

గురువారం నాడు క్రైంపార్టీ బృందాలతో కమిషనరేట్ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అడిషనల్ కమిషనర్ జి చంద్రమోహన్(పరిపాలన) మాట్లాడుతూ నేరాల ఛేదనే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. పట్టుదలతో కృషిచేస్తే ఎలాంటి కేసునైనా ఛేదించవచ్చన్నారు. ప్రస్తుత ఎండాకాలంలో దొంగతనాలు జరిగేందుకు ఎక్కువగా ఆస్కారం ఉంటుందని, క్రైంపార్టీ పోలీసులు అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. ఇతర జిల్లాలకు చెందిన నేరాలు, నేరస్థులు పట్టుబడే విధానాలను పరిశీలించాలని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నేరాల ఛేదనకు సైబర్ ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమాచార వ్యవస్థను పెంపొందించుకోవడం ద్వారా నేరస్థుల కదలికలను పసిగట్టవచ్చని పేర్కొన్నారు. రివార్డులు, ఆవార్డుల ప్రకటనలో క్రైంబృందాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఏతరహా నేరాలు ఏఏ నేరస్థులు చేస్తారో నేరం జరిగిన వెంటనే అంచనాకు రావాలని సూచించారు. నేరస్థలంలో సాక్ష్యాధారాలు చెదరకుండా తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నేరస్థలంలో సాక్ష్యాధారాలు చెదిరిపోయినట్లయితే జరిగే నష్టాలను వివరించాలని తెలిపారు. నేరాల నియంత్రణకు రేయింబవళ్ళు గస్తీని ముమ్మరం చేయనున్నామని చెప్పారు. నేరాల ఛేధనలో అంతగా ఆసక్తిగా చూపనివారిని ఇతరప్రాంతాలకు బదిలీచేస్తూ వారిస్థానాల్లో చురుకుగా పనిచేసేవారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈమధ్యకాలంలో ఎలాంటి కేసులను ఛేదించడంలో విఫలమైన వారికి సంబంధించిన వివరాలతో నివేదిక అందజేయాలని సిసిఎస్ ఏసిపిని ఆదేశించారు.

ఈ సమావేశంలో సిసిఎస్ ఏసిపి కె శ్రీనివాస్, టూటౌన్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణ్‌బాబు, సైబర్‌ఫోరెన్సిక్‌ల్యాబ్ ఇన్స్‌పెక్టర్ టి మురళీ, క్లూస్‌టీం ఎస్ఐ శ్రీధర్, సిసిఎస్ ఎస్ఐలు అశోక్‌రెడ్డి, ప్రసాద్‌లతోపాటుగా క్రైంబృదాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

వన్ నేషన్..వన్ మార్కెట్

నిత్యావసర వస్తువుల చట్టం సవరణ

రైతుల ప్రయోజనాలను పరిరక్షించేల లక్ష్యం

రైతుల ఆదాయం పెరిగేందుకు బాటలు పడతాయి

కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన జవదేకర్

న్యూఢిల్లీ,జూన్4(ఆర్ఎన్ఎ): ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఆరు దశాబ్దాల (1955) నాటి నిత్యావసర వస్తువుల చట్టానికి చేసిన సవరణను ఆమోదించింది. వ్యవసాయోత్పత్తుల నిల్వలపై ఆంక్షలు విధించడానికి ప్రభుత్వానికి అధికారాలు కల్పిస్తున్న ఈ చట్టాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రధానంగా ఈ చట్ట సవరణ చేసినట్టు మంత్రులు ప్రకాష్ జవదేకర్, నరేంద్ర తోమర్ మంత్రివర్గ సమావేశానంతరం మీడియాకు తెలిపారు.

రైతుల కోసం కేంద్ర కేబినెట్ మూడు కీలక నిర్ణయాలు తీసుకుంది. వన్ నేషన్ వన్ మార్కెట్ ఏర్పాటు దిశగా ముందడుగు వేస్తూ రైతులు ఇకపై తమ పంటలను దేశంలో ఎక్కడైనా అంటే ఏ రాష్ట్రంలోనైనా అమ్ముకునేలా అనుమతినిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రైతులకు మేలు చేసేందుకు నిత్యావసరాల చట్టాన్ని సవరించాలని కూడా నిర్ణయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. నిత్యావసరాల చట్టాన్ని సవరిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులు చోటుచేసుకుని రైతుల ఆదాయం పెరిగేందుకు బాటలు పడతాయని జవదేకర్ చెప్పారు. అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీతో ఏర్పడుతున్న ఇబ్బందులు రైతులకు ఇక ఉండబోవన్నారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకున్నదని జవదేకర్ చెప్పారు. బుధవారం అత్యవసర వస్తువుల సవరణ చట్టంలో రైతులకు మేలు జరిగే పలు నిర్ణయాలను చేర్చామని జవదేకర్ తెలిపారు. తాజా సవరణలతో రైతులు ఎక్కడైనా తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు స్వేచ్ఛ లభించిందన్నారు. అదేవిధంగా కోల్‌కతా పోర్ట్ ట్రస్ట్ పేరును శ్యామప్రసాద్ ముఖర్జీ ట్రస్ట్‌గా మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి కూడా క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిందని జవదేకర్ తెలిపారు. పేదలు, రైతులు, చిన్న తరహా వ్యాపారులు, కరోనా వైరస్ కారణంగా దెబ్బతిన్న పరిశ్రమలను ఆదుకునేందుకు ఇటీవల ప్రకటించిన 20లక్షల కోట్ల ప్యాకేజీలో భాగంగా ఈ విధమైన సహాయక చర్యలు తోడ్పడతాయని ఆయన చెప్పారు. వన్ నేషన్-వన్ మార్కెట్ పథకాన్ని అమలు చేయాలని కూడా కేబినెట్ తీర్మానించిందన్నారు. సవరణ అనంతరం పప్పుధాన్యాలు, వంట నూనెలు, ఆయిల్ సీడ్స్, అపరాలు, ఉల్లిపాయలు, పొటాటో వంటి ఉత్పత్తులను ఇక డీరెగ్యులేట్ చేసే సూచనలున్నాయని, దీని వల్ల వ్యవసాయదారులు తమ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా విక్రయించుకోవచ్చునని వారు చెప్పారు. ఈ సవరణ నేపథ్యంలో ఏ స్టాక్ పరిమితి కూడా ప్రాసెసర్లకు వర్తించబోదని, ఈ విధమైన పరిమితులు కేవలం అసాధారణ పరిస్థితుల్లోనే.. అంటే ప్రకృతి విపత్తులు, దుర్భిక్షం వంటి పరిస్థితుల్లోనే విధిస్తారని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ కూడా తెలిపారు. దేశంలో నిత్యావసరాల కొరత ఉన్నప్పుడు ఈ చట్టం తెచ్చారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. దేశంలో ఆహార ధాన్యాల కొరత లేదు అని ప్రకాష్ జవదేకర్ వెల్లడించారు. ఉత్పత్తులు అధికంగా ఉన్నప్పుడు ఈ చట్టాన్ని సవరించాల్సిందే అని ప్రభుత్వం అభిప్రాయపడిందన్నారు. సంస్కరణల్లో భాగంగా రైతులకు, వ్యవసాయ రంగానికి పెద్దగా ఊతమిచ్చేందుకు మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని ప్రభుత్వం గత నెలలోనే నిర్ణయించి ందన్నారు.

సిఐఐ తదుపరి అధ్యక్షుడిగా ఉదయ్ కోటక్

ముంబై,జూన్4(ఆర్ఎన్ఎ):భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) 2020-2021 సంవత్సరానికిగాను అధ్యక్షుడిగా కోటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్

కేసీఆర్ ఆశయాలను రైతులకు వివరించండి

సమగ్ర వ్యవసాయం.. రైతులకు ఆనందం

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి

వేములవాడ,జూన్ 4 (నేటినిజంప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు పాడి పంటల పై ఆధారపడి జీవించే రైతులను

రాజు గా మార్చాలని ఆశయం కృతనిశ్చయంతో ఉన్నారని, ఆయన ఆశయాలను ప్రతి రైతుకు చేరేలా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి సూచించారు. బుధవారం వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ ప్రమాణ స్వీకార మహోత్సవం మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థం మాధవి అధ్యక్షతన జరుగగా, ఈ కార్యక్రమానికి జెడ్పి చైర్ పర్సన్ న్యాల కొండ అరుణ ముఖ్యతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ అరుణ మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ విధానం తో పెట్టుబడులు తక్కువై మద్దతు ధర పెరిగే అవకాశాలు ఉంటాయని దీనితో రైతులకు లాభదాయకమే తప్ప నష్టం ఉండదని, రైతులు పండించిన ప్రతీ పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీనితో రైతులకు అధిక దిగుబడి లభించి, సరైన మద్దతు ధరను ధరతో విక్రయించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ విధానం వల్ల రైతులకు ఆనంద కరమే కాకుండా వివిధ రకాల పంటలను వేయడం ద్వారా క్రిమిసంహారక మందుల వాడకం తగ్గి, సారవంతమైన నేలగా భూమి మంచి దిగుబడినిస్తుంది అని తెలిపారు. రైతులంతా ఒకే రకం పంటను వేయడంతో ప్రజలు లు ఇతర ఆహార ధాన్యాలకు అల్లాడి పోవ డంతో పాటు, పంట డిమాండ్ పడిపోయి నష్టపోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని నివారించడానికి ప్రభుత్వం రైతు మేలు కోరి నియంత్రణ పంటల విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా రైతుకు కావాల్సిన అన్ని వసతులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసారని తెలిపారు. రైతు బందు, రైతు భీమా, 24గంటల కరెంట్, ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయం పండుగగా మారిందన్నారు. కేసీఆర్ స్వయంగా రైతు కావడంతో రైతులను సంఘటితం చేసి రైతును రాజును చేయాలనే గొప్ప ఆలోచన చేసారని, పండించిన పంటకు మద్దతు ధర డక్కాలంటే డిమాండ్ ఉన్న మేరకు పంట వేయడం ద్వారా, పంట మార్పిడీల ద్వారా సాధ్యమవుతుందనే ఆలోచనతో ముఖ్యమంత్రి రైతు పక్షపాతిగా మండలాల్లో కూరగాయలు, పూలు పండ్లకు అధిక డిమాండ్ ఉంటుందని, డిమాండ్ కు తగ్గట్టుగా పంటవేసే విధంగా భూపరిక్షలు నిర్వహించి అందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను కోరారు. ఉన్న అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలన్న ఆయన సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయంపై సమగ్ర ప్రణాళికను రూపొందించారని దాన్ని రైతులకు వివరించి అమలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని, కేసీఆర్ తీసుకున్న సమగ్ర వ్యవసాయ విదానం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు .ముందుగా నూతన పాలక వర్గం చైర్మన్ గా గడ్డం హన్మాండ్లు ,వైస్ చైర్మన్ గా ఉరడి ప్రవీణ్ డైరెక్టర్లుగా పీర్ మహమ్మద్ , దొంతుల అంజనికుమార్, కనపర్తి అంజయ్య, భూముల లక్ష్మణ్, రెడ్డవేని పావని , మనుపాటి తిరుపతి ,గోగూరి కమలాకర్ రెడ్డి ,పైడి శ్రీనివాస్ ,ఏనుగు తిరుపతిరెడ్డి,రామతీర్థపు మాధవి లకు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారి షాబోద్దీన్ ప్రమాణ స్వీకారం చేయించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరైతును రాజును చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి , వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ 'అర్బన్ ఎంపిపి బుర్ర వజ్రమ్మ బాబు ,జడ్పీటీసీలు ఎశవాణి,మేకల రవి ,సెస్ డైరెక్టర్లు జడల శ్రీనివాస్ ,రామతీర్థపు రాజు , వైస్ చైర్మన్ మధు రాజేందర్ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ,ఎంపీటీసీలు, సర్పంచ్లు ,టీఆర్ఎస్ నాయకులు ,ప్రజలు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

వేములవాడ,జూన్ 4 (నేటినిజంప్రతినిధి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం లో రెండవ సారి డైరెక్టర్ గా ఎన్నికైన పీర్ మహమ్మద్ ను ఆయన చిన్ననాటి స్నేహితులు, న్యూ టైగర్ యూత్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. బుధవారం ఫీర్ మహమ్మద్ స్వగృహానికి వారి చేరుకొని, శాలువా కప్పి, పూలదండలతో ఘనంగా సత్కరి ంచారు. ఈ సందర్భంగా యూత్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఫీర్ మహమ్మద్ తమకు మంచి మిత్రుడని, పార్టీ కోసం, తెల ంగాణ రాష్ట్ర సాధన లో ఎంతగానో కృషి చేశాడని, అలాంటి వ్యక్తికి రెండో పర్యాయం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా పదవీ లభించడం ఆయన చేసిన సేవ గుర్తింపు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పులి రాంబాబుగౌడ్, ముప్పిడి శ్రీధర్ ,గుర్రం అశోక్ ,ఉడుతల రాము , ముంజ ఉమేందర్ ,గిన్నెల రవీందర్ ,కీసరి శ్రీనివాస్ ,నందిపేట రమణయాదవ్ ,అంబటి మోహన్ తదితరులు పాల్గొన్నారు

మృతుడి కుటుంబానికి మీడియా అకాడమీ అండగా ఉంటుందని భరోసా

-మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు

వేములవాడ,జూన్ 4 (నేటినిజంప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా టీవీ9 రిపోర్టర్ శ్యామ్ సుందర్ బుధవారం రాత్రి మృతి చెందాడు. మరణ వార్త తెలుసుకున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాష సిరిసిల్ల కు చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు ..

మృతుని కుటుంబానికి మీడియా అకాడమీచైర్మన్ అల్లం నారాయణ అండగా ఉంటారనీ, కుటుంబానికి లక్ష రూపాయలు తక్షణ సహాయం ,కుటుంబ సభ్యులకు పెన్షన్ మంజూరైలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

శ్యామ్ సుందర్ ది కడు పేద కుటుంబం ..సో అల్లం సార్ ఆశీస్సులు వారి కుటుంబానికి ఉండాలని పాత్రికేయ సోదరులు విజ్ఞప్తి చేస్తున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సిరిసిల్ల కు చెందిన పలువురు జర్నలిస్టు ఉన్నారు.

అరేళ్ల సిఎం కేసీఆర్ పాలనలో అంతా అవినీతే

ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు

నిరుద్యోగులను పూర్తిగా దగా చేశారు

మీడియాతో ఎంపి ధర్మపురి అర్వింద్

న్యూఢిల్లీ,జూన్3(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ వచ్చిన ఆరు సంవత్సరాల కాలంలో లక్ష ఉద్యోగాలు వచ్చాయి కానీ ఆఫీస్ లేదు. నిరుద్యోగ భృతి వచ్చింది కానీ వారికి అకౌంట్లు లేవు. దళితులకు మూడు ఎకరాల భూమి వచ్చింది కానీ ఏమీ పంట వేయాలో తెలియట్లేదు. దళిత ముఖ్యమంత్రి అయ్యాడు కాని ఎవరో తెలియదు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షకోట్ల లూటీ అయింది ?అది కనిపించదని ఆరేళ్ల సీఎం కేసీఆర్ పాలనపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగ నిర్మూలనలో సిఎం కెఇసార్ ఇచ్చిన హామీలన్నీ అలాగే ఉన్నాయని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి ఆరు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పింక్ పార్టీ నాయకులకు శుభాకాంక్షలు అని ఎంపీ అరవింద్ చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు ఎక్కడ అని ప్రశ్నించారు. జాతీయ మీడియా చేపట్టిన సర్వేలో ముఖ్యమంత్రి కేసీఆర్ కి 16 స్థానం దక్కిందని, అత్యంత చెత్త ముఖ్యమంత్రి అని నిర్ధారణ అయిందని అరవింద్ అన్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నాలుగువ స్థానంలో ఉన్నారన్న ఎంపీ.. అవినీతి ముఖ్యమంత్రిపై సర్వే చేస్తే ముఖ్యమంత్రి కేసీఆరే మొదటి స్థానంలో ఉంటారన్నారు. ఆయన మంత్రివర్గంలో అంతా తెలంగాణ ద్రోహులేనని అన్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక కేవలం 25000 ఉద్యోగాలు విడుదల చేసారని అరవింద్ అన్నారు. ఇప్పటి వరకు మూడు లక్షల మందికి నిరుద్యోగ భృతి లేదని.. కేవలం కేసీఆర్ కుటుంబంలోని వారికి మాత్రమే ఉద్యోగాలు దొరికాయన్నారు. ప్రజలు తిరస్కరిం చిన వారు కూడా ఉద్యోగాలు పొందుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చాలా సహాయం చేస్తున్నా.. కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయటం లేదన్నారు. లాక్‌డౌన్‌లో 1500 రూపాయలు కేంద్రమే ఇచ్చిందని, బియ్యం, పప్పు అన్నీ కూడా కేంద్ర నుంచే అమలవుతున్నాయన్నారు. ఆయుష్మాన్ భవా పథకాన్ని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఆ పథకం ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ లో కూడా అవినీతి జరుగుతుందని శవాల మీద పేలాలు వేరుకుంటున్నారన్నారు.. మంత్రులు కూడా అవినీతికి పాల్పడుతున్నారన్నారు.

గిట్టుబాటు ధరల కోసమే నియంత్రిత సాగు

రైతులు సాగులో రాటుదేలితేనే మంచిది: మంత్రి

యాదాద్రి భువనగిరి,జూన్4(ఆర్ఎన్ఎ): నియంత్రిత సాగుతోటే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న పంటలు వేస్తే అమ్మడం కూడా సులువవుతుందని అన్నారు. అందులో భాగమే లాభదాయక పంటలపై రైతాంగం దృష్టి సారించేలా నియంత్రిత సాగుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. భువనగిరిలో నిర్వహించిన నియంత్రిత సాగు ససదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నదే అవగాహన సదస్సుల లక్ష్యం అన్నారు. ఇందులో రైతులను భాగస్వామ్యం చేసేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.డిమాండ్ ఉన్న పంటలపై రైతులు దృష్టి సారించినప్పుడు మాత్రమే మనం పండించిన పంటకు మనం ధర నిర్ణయించుకునే శక్తి వస్తుందన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ నియంత్రిత సాగుపై సాహసో పేతమైన నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని, అందుకు అనుగుణంగా రైతులు కలసి వస్తే భవిష్యత్ మొత్తం వ్యవసాయ రంగానిదే అవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వధువుకు కరోనా పాజిటివ్

తమిళనాడులో ఆగిపోయిన పెళ్లి

చెన్నై,జూన్4(ఆర్ఎన్ఎ): పెళ్లి కూతురుకు కరోనా అని తేలడంతో జరగాల్సిన పెళ్లి కాస్తా ఆగిపోయింది

తమిళనాడులోని కోవై జిల్లాలో కరోనా లాక్‌డౌన్ ఉన్నటికీ నిబంధనలను పాటిస్తూ పెళ్లి చేసుకోవాలను కున్నారు తమిళనాడుకు చెందిన ఓ జంట. గత నెల వివాహం నిశ్చయం కావడంతో ఉద్యోగ రీత్యా డిల్లీలో పని చేసే వధువు మే నెలలో తమిళనాడులోని వారి గ్రామానికి చేరుకుంది. డిల్లీ నుంచి వచ్చినట్లు తెలుసుకున్న అధికారులు వధువును క్వారంటైన్ చేసి కరోనా టెస్టులు నిర్వహించారు. దీంతో వధువుకు కరోనా ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ కావడంతో అధికారులు ఆమెను వైద్యం కోసం ఆసుపత్రికి తరళించారు. దీంతో జరగాల్సిన పెళ్లి కాస్త ఆగిపోయింది. అయితే వీరి పెళ్లి అనుకున్న సమయానికి జరగక పోవడం ఇదేమీ మొదటిసారి కాదు. కొద్ది రోజుల క్రితమే లాక్‌డౌన్‌తో, తిరిగి అమ్మాయిని క్వారంటైన్ చేయడంతో రెండు సార్లు ఆగింది. ఇక అమ్మాయికి క్వారంటైన్ గడువు ముగిసాక తిరిగి పెళ్లి చేసుకుందామనుకున్న ఈ జంటకు మళ్ళీ ఎడబాటు తప్పలేదు. అమ్మాయికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఇక పెళ్లి ఇప్పట్లో జరిగే అవకాశం లేకుండా పోయింది.

వ్యాయామాలపై దృష్టి కేంద్రీకరించిన కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు

కరీంనగర్, జూన్ 4(నేటి నిజంప్రతి నిధి): మానసికంగా,శారీరకంగా సంసిద్ధంగా ఉండటంతోపాటు రోగని రోధకశక్తిని పెంపొందించుకునేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు వివిధ రకాల వ్యాయామాలపై దృష్టికేంద్రీకరించారు. ప్రస్తుతం నెలకుని ఉన్న పరిస్థితుల్లో గతరెండున్నర నెలల నుండి రేయింబవళ్ళు అలుపెరుగకుండా ప్రాణాలనుసైతం ఫణంగా పెట్టి విధులను నిర్వహించిన పోలీసులు సడలింపులతో లభించిన సమాయాన్ని వృధాచేయకుండా తమకు వీలైన సమయాల్లో వివిధ రకాల వ్యాయామాలను కొనసాగిస్తున్నారు.

మానసికంగా,శారీరకంగా సంసిద్ధం గా ఉంటేనే మరింత సమర్ధవంతంగా విధులను నిర్వహించడం, ప్రస్తుతం నెలకునిఉన్న విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడమే ధ్యేయంగా పెట్టుకుని ఈ వ్యాయామాలను ప్రారంభించారు. వయోభారంతో కొందరు యోగా,ధ్యానంలాంటివి చేస్తున్నారు. కమిషనరేట్‌వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన పోలీసులు సమయానుకూలతను బట్టి ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

వ్యాయామం, యోగా,ధ్యానంలద్వారా మానసికంగా,శారీరకంగా ఉల్లాసాన్ని పొందుతున్నారు. మానసికంగా, శారీరకంగా సంసిద్ధంగా ఉండటమే లక్ష్యంగా పోలీసులు ఆరోగ్యంపై దృష్టిసారించడం ఆహ్వానించదగిన పరిణామం.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగుతున్నారు

ఈ మధ్యకాలంలో కమిషనరేట్ కేంద్రంలో జరిగిన వివిధ రకాల శిక్షణలు, కార్యక్రమాల సందర్భంగా సహనం కొల్పోకుండా ఉండటం, అంకితభావంతో పనిచేయడం వల్ల లభించేగుర్తింపులు, దేహదారుఢ్యాన్ని కాపాడుకునేందుకు దోహదపడే పలుఅంశాలను ప్రవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి వివరించారు. ఇందులో అన్నీకూడా దేహదారుఢ్యాన్ని కాపాడుకోవడంద్వారా లభించేప్రయోజనాలు, సహనం కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకుసాగితే ఎంతటిక్రూరమృగాలనుండైనా ప్రాణాలను కాపాడుకోవచ్చనే సందేశం ఉండటంతో ప్రేరేపితులై వారిలో సహజంగా ఉత్సాహం ఏర్పడివివిధరకాల వ్యాయామాలను చేస్తున్నారు.

పోలీసులు ఇస్తున్న ప్రాధాన్యతకు ఆశ్చర్యకితులైన పోలీస్ కమిషనర్

పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆకస్మికంగా ఉదయం,సాయంత్రం వేళల్లో కొన్నిప్రాంతాలను అక్కడివారికి ఎలాంటి సమాచారం అందించకుండావెళ్ళి సందర్శించారు. వారు వ్యాయామాన్ని కొనసాగించేందుకు ఉత్సాహంతో ముందుకువచ్చి దినచర్యల్లో భాగంగా అలవర్చుకోవడాన్ని ప్రత్యక్ష్యంగా చూసి ఆశ్చర్యపోయారు. వయోపరిమితితో తేడాలేకుండా తమకు అనువుగా ఉండే వ్యాయామం, యోగా,ధ్యానంలను పరిశీలించి వారితో కలిసి పాల్గొన్న సందర్భాలు ఈమధ్యకాలంలో అనేకంగా ఉన్నాయి.

ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి

దేహదారుఢ్యం, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పోలీసులు తమకువీలైన సమయాల్లో వివిధరకాల వ్యాయామాలను చేస్తుడటం అహ్వానించదగిన పరిణామమని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. పుట్టిన ప్రతి మానవుడు ఎన్నటికైనా మరణించకతప్పదు. బతికున్నంతకాలం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వారు కొనసాగిస్తున్న వివిధ రకాల వ్యాయామాలు కొనసాగిస్తున్నవారికి ప్రోత్సాహాన్నిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిఉద్యోగికి పదవివిరమణ తప్పదు. పదవి విరమణ పొందినా వారు ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో పైన పేర్కొనబడిన అంశాలను దినచర్యలో భాగంగా అలవర్చుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. కమిషనరేట్‌పోలీసులు ఎన్నోకార్యక్రమాల నిర్వాహణతో దేశవ్యాప్తంగా గుర్తింపుపొందారు. తాజాగా మరోమైలురాయిని దాటేందుకు ముందుకు రావడం చాలాఅరుదుగా లభిస్తాయని తనభావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.

రైతు వేదికలు..ప్రగతికి రహదారులు

నారాయణపేట జూన్ 4: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతును రాజును చేయడం లక్ష్యంగా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని. ఆబ్కారి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మద్దూర్ మండలంలోని లింగాల్ చెడ్ క్లస్టర్ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నదాతలను ఆదుకునేందుకే రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశ పెట్టి ప్రోత్సహిస్తున్న ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు.

డిమాండ్ ఉన్న పంటలను వేసి లాభాలను గడించాలన్నారు. ప్రభుత్వం సూచించిన పంటలు వేసి ఆర్థికంగా బలపడాలని సచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రైతు వేదిక కార్యక్రమం ద్వారా క్లస్టర్ లోని రైతులందరికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో లక్షా ఇరవై వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి చెరువును నింపి సాగునీరు అందిస్తామన్నారు

దేశంలో రైతుల కల నెరవేరింది -స్మృతి ఇరానీ

న్యూఢిల్లీ, జూన్ 4: కేంద్ర క్యాబినెట్ బుధవారం తీసుకున్న పలు నిర్ణయాలు దేశంలోని రైతులకు ఎంతో మేలు చేసేవిగా ఉన్నాయని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చెప్పారు. క్యాబినెట్ ఆమోదించిన 'వన్ నేషన్ వన్ మార్కెట్' విధానం రైతులకు వరం లాంటిదని ఆమె పేర్కొన్నారు. రైతులు తమ పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే అవకాశం కల్పించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారన్నారు. ఈ కొత్త విధానంవల్ల రైతులు తమకు గిట్టుబాటు ధర లభించిన దగ్గరే పంటలను అమ్ముకోవచ్చని, దీంతో దళారుల చేతిలో మోసపోకుండా ఉంటారని మంత్రి అభిప్రాయపడ్డారు.

దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చెప్పారు. అందులో భాగంగా దేశ ప్రజలకు క్లిష్టంగా మారిన ఎన్నో స్కీమ్‌లను సరళీకరించిందని తెలిపారు. ఇప్పటికే 'వన్ నేషన్ వన్ ట్యాక్స్', 'వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్' వంటి విధానాలను అమల్లోకి తెచ్చిన కేంద్రం ఇప్పుడు 'వన్ నేషన్ వన్ మార్కెట్' విధానాన్ని తీసుకురావడం సంతోషకరమైన పరిణామం అన్నారు. దీంతో రైతుల దశాబ్దాల కల నెరవేరిందని చెప్పారు. ఈ సందర్భంగా దేశంలోని రైతులందరికీ స్మృతి ఇరానీ శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళకు కరోనాగా నిర్ధారణ

యాదాద్రి,జూన్4(ఆర్ఎన్ఎ): ఆలేరు రూరల్ మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన ఓ మహిళకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. మండల వైద్యాధికారి జ్యోతిబాయి తెలిపిన వివరాల ప్రకారం.. 38సంవత్సరాల వయస్సు గల వివాహిత కొంత కాలంగా గుండె జబ్బుతో బాధ పడుతోంది. చికిత్స నిమిత్తం మే 28న సికింద్రాబాదులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. రెండు రోజుల వ్యవధిలో జ్వరం, శ్వాస సంబంధిత లక్షణాలు కనిపించడంతో అనుమానం కలిగిన ఆస్పత్రి వైద్యులు టెస్ట్ చేయగా కరోనా పాజిటివ్ అని బయటపడింది.

ఇద్దరు డైరెక్టర్లకు ముస్లిం మైనార్టీ నాయకులు సన్మానం

వేములవాడ,జూన్ 4 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు .

ఈ పాలకవర్గంలో డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన ఏనుగు తిరుపతిరెడ్డి ,పీర్ మహమ్మద్ ను పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా శాలువతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో జామా ,మదీనా మజీద్ అధ్యక్షులు షేక్ సర్వర్ ఎండి బురాన్, నాయకులు సలీం , రఫిక్ ,సాదుల్లా ,అంజత్ పాషా,గౌస్ బాబా, రజాక్, అన్వర్, వలి, రఫిక్ తది తరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డ చేతిలోనే రాజ్యం

-మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు

వేములవాడ,జూన్ 4 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం రైతు బిడ్డ చేతిలోనే ఉందని, రైతును కష్టజీవి గా కాకుండా దేశం ముద్దుబిడ్డ గా చూడాలనే సంకల్పంతో వ్యవసాయ విధానంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వస్తున్నారని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు అన్నారు. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా గడ్డం హన్మాండ్లు ,వైస్ చైర్మన్ గా ఉరడి ప్రవీణ్ 'ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల ముఖ్యమంత్రి పదవీ కాలంలో కెసిఆర్ రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వాటిలో లో పాడి రైతు మండి, పంట పండించే కౌలు రైతు వరకు అభివృద్ధి పథకాల ప్రణాళికలను రూపొందించి వ్యవసాయ సాగు విధానం లో మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేశారన్నారు. రైతుబిడ్డగా కెసిఆర్ జన్మించి, రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను సహించలేక ఆంధ్ర పాలకుల నుండి విముక్తి కలిగించి, సు రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నేర్పాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నా రని అన్నారు. అంతేకాకుండా రైతు సేవ చేయాలంటే మరో రైతు చేతిలోనే మార్కెట్ కమిటీ పాలకవర్గం అందజేయాలని ఉద్దేశంతో ప్రస్తుత పాలకవర్గంలో రైతులకు పట్టం కట్టారని అన్నారు. ముందుగా తమ నియామకానికి సహకరించిన మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేష్ బాబు లకు పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వేదికను అలంకరించిన జెడ్పి చైర్ పర్సన్ న్యాల కొండ అరుణ రాఘవరెడ్డి, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి,వైస్ చైర్మన్ మధు రాజేందర్ శర్మ సెస్ డైరెక్టర్ లు రామతీర్థం రాజు జడల శ్రీనివాస్, ఏనుగు మనోహర్ రెడ్డి ,కొండ దేవయ్య లను నూతన పాలకవర్గం

శాలువా కప్పి, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి, రైతులు, మున్సిపల వార్డు కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు

కేంద్రం తీరు దారుణం

కరోనా యుద్ధంలో ఉంటే డిఏ రద్దు చేస్తారా: ఎన్జీవోలు

విజయవాడ,జూన్4(ఆర్ఎన్ఎ): కరోనా కష్టకాలం పేరుతో కేంద్ర ఉద్యోగుల డిఎను ఫ్రీజ్ చేయడంపై ఉద్యోగాల సంఘాలు మండిపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి కారణంగా ఈరోజు నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. కరోనా విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు కీలకంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రాణాలకు తెగించి పని చేసినా.. మూడు డీఏలను ఫ్రీజ్ చేయడాన్ని ఖండిస్తున్నామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు చంద్ర శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవో సంఘాల నిరసన కార్యక్రమం జిరగింది. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లంచ్ సమయంలో గంట పాటు ఆందోళన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, విద్యాసాగర్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనాను లెక్క చేయకుండా పని చేస్తే ఇదేనా బహుమానమని ప్రశ్నించారు. ఏపీలో రెండు నెలలు సగం జీతాలే ఇచ్చినా తాము.. పని చేశామన్నారు. వరాలను ప్రకటించాల్సిన కేంద్రం.. ఉన్న రాయతీలను రద్దు చేయడం కరెక్ట్ కాదన్నారు. కేంద్రం తమ నిర్ణయాన్ని రద్దు చేసుకునే వరకు పోరాడతామన్నారు. రెండు సంవత్సరాల నుంచి పీఆర్సీ కూడా ఇవ్వలేదని.. వెంటనే ఇవ్వాలని చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్